aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people.
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
తెలుగు దినపత్రిక
శనివారం
25-04-2026 సంపుటి : 01 సంచిక :34 పేజీలు : 08 వెల :₹ 5/-
Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com

BESQATI
www.besqati.com
besqati.com
Contact : info@besqati.com

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

- భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక
- టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ
- ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు



కోల్‌కతా, ఏప్రిల్ 24( మహాప్రభ )
: పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా -మిగతా 3 లో

## ఢిల్లీ నుంచి బీజేపీని తరిమేస్తా..

- బెంగాల్ తర్వాత ఢిల్లీనే లక్ష్యం
- బీజేపీని అధికారంలోంచి కూలదోయడమే నా లక్ష్యం
- సీఎం మమతా బెనర్జీ ప్రకటన



న్యూఢిల్లీ ఏప్రిల్ 24( మహాప్రభ )
పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో గెలిచిన తర్వాత తమ తదుపరి లక్ష్యం ఢిల్లీ పీఠం నుంచి బీజేపీని కూలదోయడమేనని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. గురువారం చౌరింగీలో జరిగిన ఒక ఎన్నికల సభలో ఆమె మాట్లాడుతూ బెంగాల్‌లో విజయం సాధించిన తర్వాత బీజేపీని నాశనం చేయాలని అనుకుంటున్నామని, కమలం పార్టీని గద్దె దించి ఢిల్లీలో అధికారాన్ని కైవసం చేసుకుంటామని అన్నారు. -మిగతా 3 లో

## 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- 8,500 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు
- ఎప్పటికప్పుడు ధాన్యాన్ని తరలించేందుకు రవాణ వసతి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్ 24( మహాప్రభ
: రబీ సీజన్ లో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల,పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే 20 జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరుతుండడంతో కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాల్లో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. రబీ సీజన్లో ధాన్యం కొనుగోళ్ల పక్రియపై శుక్రవారం రోజున డాక్టర్ బి.ఆర్. -మిగతా 3 లో




## ఒక్క నెలలో 46,750 మందిపై వేటు!

- మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్‌లో భారీగా కోతలు
- వచ్చే నెల్లో 8 వేల మందిని తొలగించనున్న మెటా

వాషింగ్టన్ ఏప్రిల్ 24( మహాప్రభ )
టెక్ కంపెనీల్లో ఉద్యోగాల ఊచకోత కొనసాగుతూనే ఉన్నది. ఆటోమేషన్‌లో భారీ పెట్టుబడులు, కృత్రిమ మేధ(ఏఐ) ప్రభావం కారణంగా చాలా కంపెనీలు వేలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నాయి. రాయిటర్స్ కథనం ప్రకారం మే 20న ప్రారంభయ్యే మలి విడత కోతలు ఈ ఏడాది చివరి నాటికి కొనసాగే అవకాశం ఉన్నది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తమ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో 10 శాతం మందిని (సుమారు 8 వేల మంది) ఇప్పటికే తొలగించాయి. ఒక్క నెలలోనే మెటా, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్ కంపెనీల్లో సుమారు 46,750 మంది ఉద్యోగాలు కోల్పోయారు.అమెజాన్ కూడా ఇటీవల సుమారు 30 వేల మంది ఉద్యోగులను ఇంటికి పంపింది. సీఎన్‌బీసీ నివేదిక ప్రకారం.. మైక్రోసాఫ్ట్ కంపెనీ 51 ఏండ్ల చరిత్రలో తొలిసారి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ -మిగతా 3 లో

## తెలంగాణలో మరో కొత్త పార్టీ




### నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

- కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి
- తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

హైదరాబాద్, ఏప్రిల్ 24( మహాప్రభ )
తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత -మిగతా 3 లో



### ఆర్టీసీ సమ్మెలపై ప్రభుత్వం
## సానుకూలం

- సమ్మెపై జేఏసీతో మంత్రుల చర్చలు
- ఆర్టీసీని బలోపతేం చేద్దామన్న భట్టి

హైదరాబాద్,ఏప్రిల్ 24( మహాప్రభ )
ఆర్టీసీ సమ్మెపై చర్చలు కొలిక్కి వచ్చినట్లేనని భావిస్తున్నారు. ప్రభుత్వం కూడా కార్మికుల పట్ల సానుకూలతతో ఉన్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నేతలతో మంత్రుల బృందం భేటీ కొనసాగుతోంది. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చాలా బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు.ఆర్టీసీని మనం బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ చిన్నాభిన్నమైంది. అప్పటి పాలకులు ఎంత కఠినంగా వ్యవహరించారో మీకందరికీ తెలుసు. గత పాలకుల మాదిరిగా మేము వ్యవహరించబోం. ఆర్టీసీకి సంబంధించిన పాలన, విధానపరమైన నిర్ణయాలపై చర్చిద్దాం. కార్మికుల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరించు కుందామని భట్టి అన్నారు. మొత్తం 32 డిమాండ్లను జేఏసీ నేతలు మంత్రుల ముందు ఉంచారు. ఇప్పటికే 29 డిమాండ్లపై సానుకూలంగా ఉన్నామని మంత్రి పొన్నం ప్రకటించిన నేపథ్యంలో.. మూడు కీలక డిమాండ్లపై మంత్రులు, జేఏసీ నేతలు చర్చిస్తున్నారు. ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాలకు గుర్తింపు, పీఆర్‌సీపై -మిగతా 3 లో



### ఆర్టీసీ డ్రైవర్
## బలిదానం

### సమ్మెలో విషాదం


- నర్సంపేటలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- 90 శాతం కాలిన గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు
- చికిత్స పొందుతూ శంకర్ గౌడ్ కన్నుమూత
- డ్రైవర్ మరణంపై సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి పొన్నం దిగ్భ్రాంతి
- ఇది ప్రభుత్వ హత్యేనని బండి సంజయ్ ఫైర్
- ఆత్మ బలిదానాలు వద్దని హరీష్ రావు పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 24( మహాప్రభ )
ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. -మిగతా 3 లో

### ఆమ్‌ఆద్మీ పార్టీకి
## భారీ షాక్..

### పార్టీకి ఎంపీ రాఘవ్ చద్దా గుడ్‌బై

- మరో ఇద్దరు ఎంపీలతో కలిసి నబీన్ సమక్షంలో బీజేపీలో చేరిక
- మొత్తం ఏడుగురు ఎంపీలు కమలం గూటికి చేరుతున్నట్లు ప్రకటన
- దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి తమ పార్టీ ఎంపీలను బీజేపీ లాక్కుంటున్నదని ఆప్ ఆగ్రహం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 24( మహాప్రభ )
అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్‌ఆద్మీపార్టీకి (ఆప్) భారీ షాక్ తగిలింది. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన రాజ్యసభ సభ్యులు రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్ శుక్రవారం బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో కాషాయ కండువా -మిగతా 3 లో

### చిన్నస్వామిలో
## కింగ్ షో..

- 206 రన్స్ టార్గెట్ ఉఫ్..
- గుజరాత్‌ను చిత్తు చేసిన ఆర్సీబీ..!
- 206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు
- పాయింట్ల పట్టికలో రెండో ప్లేసుకు చేరిన ఆర్సీబీ



న్యూఢిల్లీ ఏప్రిల్ 24( మహాప్రభ )
ఐపీఎల్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐదో విజయం సాధించింది. శుక్రవారం బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచులో ఆర్సీబీ.. 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్.. 3 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది -మిగతా 3 లో

## పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో విజయం బీజేపీదే

- మొదటి దశలో 110కి పైగా సీట్లు గెలుస్తాం
- కేంద్రహోంమంత్రి అమిత్ షా ధీమా



కోల్‌కతా, ఏప్రిల్ 24( మహాప్రభ )
పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం బీజేపీదే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. మొదటి దశ ఎన్నికల్లో 152 స్థానాలకు గాను బీజేపీ 110కి పైగా సీట్లు కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో ఉన్న ఆయన కోల్‌కతాలో -మిగతా 3 లో

## గర్భాన్ని కొనసాగించాలని ఏ కోర్టూ బలవంతం చేయలేదు

- మైనర్ అబార్షన్‌పై సుప్రీం తీర్పు



3 లో

# హూగ్లీ నదిలో విహరించిన మోదీ..


## గంగా నదికి పూజలు



**కోల్‌కతా ఏప్రిల్ 24( మహాప్రభ )**
ప్రధాని మోదీ శుక్రవారం హూగ్లీ నదిలో విహరించారు. ఓ కెమెరాతో ఆయన ఆ నదిలో విహరిస్తూ కొన్ని ఫోటోలు తీశారు. గంగా నదికి ఆయన పూజలు కూడా చేశారు. ఏప్రిల్ 29వ తేదీ రోజున రెండో దఫా ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన బెంగాలీ నావికులతో కాసేపు గడిపారు. వారి డిమాండ్లను ఆయన అడిగి తెలుసుకున్నారు. బోటులో షికారు చేస్తూ ప్రధాని మోదీ తన చేతిలో ఉన్న కెమెరాతో ఫోటోలు తీశారు. ఆయన తన ఎక్స్ అకౌంట్‌లో ఫోటోలు షేర్ చేశారు.బెంగాలీలకు గంగా నది ఓ ప్రత్యేక స్థానం అని, బెంగాలీ ఆత్మలో గంగా నది ప్రవహిస్తుందని అంటారని, ఆ పవిత్ర నది ఈ దేశ నాగరికత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఇవాళ ఉదయం కోల్‌కతాలోని హూగ్లీ నది తీరంలో కొంత సమయం వెచ్చించానని, గంగా నదికి కృతజ్ఞత చెప్పే సందర్భం ఇది అని తన ఎక్స్‌లో రాశారు. స్థానిక నావికులతో పాటు మార్నింగ్ వాక్ వచ్చినవారితో మోదీ కలిశారు. విద్యాసాగర్ సేతు, హౌరా బ్రిడ్జ్‌ను అతిసమీపం నుంచి చూసినట్లు చెప్పారు. తొలిదశ ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ ఓ షాపుకు వెళ్లి జాల్‌ముడి తిన్న విషయం తెలిసిందే.

## ప్రియుడి ఇంటికి వెళ్లి.. అతడి భార్యను దారుణంగా చంపిన ప్రియురాలు


**ముంబై ఏప్రిల్ 24( మహాప్రభ )**
ఒక మహిళ తన ప్రియుడి ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఉన్న అతడి భార్యను కత్తితో పొడిచి దారుణంగా చంపింది. గమనించిన స్థానికులు ఆ ఇంటి డోర్‌ను బయట నుంచి లాక్ వేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆ


Sheela Sonar (45) stabbed her lover's wife, Sadhana Mahendra Sonpatkar (40).

మహిళను అరెస్ట్ చేశారు.మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 22న తెల్లవారుజామున 45 ఏళ్ల షీలా సోనార్ తన ఇంటి నుంచి బయటకు వచ్చింది. తుపాకీ, కత్తి, స్ప్రే, తాళం వంటి వస్తువులతో ప్రియుడి ఇంటికి వెళ్లింది. ప్రియుడి భార్య అయిన 40 ఏళ్ల సాధన మహేంద్ర సోన్‌పట్కర్‌పై ఉన్మాదంతో ఆమె దాడి చేసింది.కాగా, ఆ సమయంలో ఇంట్లో ఉన్న సాధన అత్త, షీలా సోనార్ చేతిలోని గన్ తీసుకుని కిటికీ నుంచి బయటకు విసిరేసింది. ఈ నేపథ్యంలో షీలా కత్తితో సాధనపై దాడి చేసింది. నేలపై పడిన ఆమె మెడపై ఆ తర్వాత ఛాతిపై పదిసార్లు కత్తితో పొడిచింది. పక్కనే సోఫాలో కూర్చొన్న సాధన అత్త ఏడుస్తూ ఈ దారుణాన్ని ఆపమని షీలాను వేడుకున్నది. తీవ్ర రక్తస్రావం వల్ల సాధన అక్కడికక్కడే మరణించింది.మరోవైపు అరుపులు విన్న స్థానికులు ఆ ఇంటి వద్ద గుమిగూడారు. కిటికీలోంచి ఈ దారుణాన్ని చూశారు. అయితే షీలా బారి నుంచి సాధనను రక్షించలేకపోయారు. బయటి నుంచి డోర్ లాక్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొందరు తమ మొబైల్ ఫోన్లలో వీడియో రికార్డ్ చేశారు. ఆ ఇంటికి చేరుకున్న పోలీసులు జరిగిన నేరాన్ని పరిశీలించారు. నిందితురాలు షీలాను అరెస్ట్ చేశారు. హత్యకు గురైన సాధన మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. వ్యక్తిగత వివాదం, వివాహేతర సంబంధం ఈ హత్యకు కారణాలని పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు

## బిజెపి మరోసారి పంజాబీలకు ద్రోహం చేసింది : కేజ్రీవాల్

**న్యూఢిల్లీ ఏప్రిల్ 24( మహాప్రభ )**
రాఘవ్ చద్దాతోపాటు పలువురు ఆప్ ఎంపీలు ఆ పార్టీకి షాక్ ఇచ్చారు. ఆప్ ఎంపీ లైన రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, అర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్




సింగ్ సాహ్నీ స్వాతి మలివాల్ లు బిజెపిలో విలీనమయ్యారు. ఈ విషయాన్ని శుక్రవారం రాఘవ్ చద్దా ప్రకటించారు. ఆప్ ఎంపీలు షాక్ ఇవ్వడంపై ఆ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నిరాశ చెందారు. కేంద్రం (బిజెపి) మరోసారి పంజాబీలకు ద్రోహం చేసిందని సామాజిక మాధ్యమం ఎక్స్ లో మండిపడ్డారు.

## ఖమేనీని హత్య చేసినందుకు ట్రంప్ క్షమాపణలు చెప్పాలి

**- ఇరాన్ మత గురువు అలీ షిరాజీ డిమాండ్**

**టెహ్రాన్ ఏప్రిల్ 24( మహాప్రభ )**
ఫిబవరి 28వ తేదీన అమెరికా -- ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందారు. దారుణంగా ఖమేనీని



హతమార్చినందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని, తమ నాయకుడిని చంపడం పొరపాటని ట్రంప్ ప్రపంచం ముందు ఒప్పుకోవాలని ఇరాన్ సీనియర్ మత గురువు అలీ షిరాజీ శ్రుకవారం డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్ పట్ల శత్రుత్వం అనేది ఖురాన్‌కు సంబంధించిందనీ, అది మార్పులేని సూత్రం అని ఆయన అన్నారు. అలాగే, శత్రువు (అమెరికా) తీసుకునే ఏ చర్యకైనా గట్టిగా ప్రతిస్పందించడానికి ఇరాన్ సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయని ఆయన హెచ్చరించారు.

# మణిపూర్‌లో మళ్లీ ఘర్షణలు..

**ముగ్గురు మృతి.. పలువురికి గాయాలు**

కుకీ-నాగా తెగల మధ్య మణిపూర్‌లో ఘర్షణలు ఆగడం లేదు. తాజాగా ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణల్లో ముగ్గురు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ ఘటన మణిపూర్, ఉఖ్రుల్ జిల్లాలో శుక్రవారం జరిగింది. మృతుల్లో ఇద్దరు కుకీ తెగకు చెందిన వారు కాగా, మరొకరు తంగ్‌కుల్ నాగా తెగకు చెందిన వారు. ద కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ముల్లామ్, షోంగ్ఫల్ గ్రామాల్లో కుకీ తెగవారు ఉంటారు.వీరి ఇండ్లపై శుక్రవారం తెల్లవారుఝామున ఆయుధాలు కలిగిన నాగా తెగవారు దాడి చేశారు. ఈ దాడిలో కుకీ తెగకు చెందిన ఇద్దరు మరణించారు.



పలువురు మహిళలు, పిల్లలు గాయపడ్డారు. వీరంతా నిద్రలో ఉండగా ఈ దాడి జరిగినట్లు చెబుతున్నారు. ఈ ఘటనలో కొన్ని ఇండ్లను కూడా దుండగులు తగులబెట్టారు. ఈ దాడుల్ని ఎదుర్కొనే క్రమంలో, తమ ప్రాణాల్ని రక్షించుకునేందుకు గ్రామస్తులు ఎదురుదాడికి దిగారు. ఈ దాడిలో నాగా తెగకు చెందిన ఒక వ్యక్తి మరణించాడు. అయితే, కుకీ తెగలవారు చేసిన ఈ ఆరోపణల్ని నాగా తెగ సెంట్రల్ కమాండ్ గార్డ్స్ ఖండించారు. తమ తెగకు చెందిన దళాలు గస్తీ విధులు నిర్వర్తిస్తుండగా.. కుకీ తెగకు చెందిన వారు దాడి చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని చెప్పారు.అక్కడకు వెళ్లిన తర్వాత కుకీ తెగవారు కాల్పులు జరపడంతో ఒక నాగా తెగ వాలంటీర్ మరణించాడని, మరో నలుగురికి గాయాలయ్యాయని చెప్పారు. దీంతో తాము కూడా ఎదురుకాల్పులు జరిపామన్నారు. ఈ ఘర్షణల నేపథ్యంలో భద్రతా బలగాలు పరిస్థితిని సమీక్షిస్తున్నాయి. ఇక రెండు తెగల మధ్య చాలా కాలంగా ఘర్షణలు జరుగుతున్నాయి.

# నితీశ్ కుమార్‌ను రాజకీయంగా బీజేపీ అంతం చేసింది

**పాట్నా: ఏప్రిల్ 24( మహాప్రభ )**
బీహార్‌లోని అధికార ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ మండిపడ్డారు. సుమారు రెండు దశాబ్దాల పాటు నితీశ్ కుమార్ నిర్వహించిన సీఎం పదవిని వదులుకునేలా ఒత్తిడి చేయడం ద్వారా బీజేపీ ఆయనను రాజకీయంగా సమాప్తం చేసిందని ఆరోపించారు. బీజేపీకి చెందిన సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం తన బలాన్ని నిరూపించుకునేందుకు శుక్రవారం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అయిన తేజస్వీ యాదవ్ ఈ సందర్భంగా సభలో మాట్లాడారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన సామ్రాట్ చౌదరికి అభినందనలు తెలిపారు.కాగా, బీజేపీతో పాటు ఎన్డీయే మిత్రపక్షమైన జేడీ(యూ)పై తేజస్వీ యాదవ్ విమర్శలు గుప్పించారు. 'నితీశ్ కుమార్ సీఎంగా కొనసాగేందుకు బీజేపీ అనుమతించదని మాకు ముందే తెలుసు. 2030 వరకు ఎన్డీయే కూటమి నేతగా నితీశ్ కుమార్ ఉంటారని బీజేపీ పదే పదే చెబుతూ వచ్చింది. కానీ ఇప్పుడు వారు ఆయనను పూర్తిగా రాజకీయంగా అంతం చేశారు'




అని అన్నారు. మరోవైపు బీహార్‌లో రాజకీయ వాతావరణం అస్థిరంగా మారిందని, ఐదేళ్లలో ఐదు ప్రభుత్వాలు మారాయని తేజస్వీ యాదవ్ విమర్శించారు. అలాగే నాయకత్వం చేతులు మారిన తీరుపై కూడా ఆయన మండిపడ్డారు. 'ఎన్నికైన ముఖ్యమంత్రిని, ఎంపికైన ముఖ్యమంత్రి తొలగించారు' అని ఎద్దేవా చేశారు.కాగా, కొత్త సీఎం సామ్రాట్ చౌదరి ఆర్జేడీలో ఉన్న రోజులను తేజస్వి యాదవ్ సభకు గుర్తు చేశారు. 'ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ శిష్యుడైన సామ్రాట్ చౌదరి ఎదుగుదల పట్ల నేను సంతోషంగా ఉన్నాను. కానీ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లలో లోతైన మూలాలు కలిగినవారు, ఆయన ఎదుగుదలను అసూయపడే వారి పట్ల ఆయన జాగ్రత్తగా ఉండాలి' అని సూచించారు. అలాగే సామ్రాట్ చౌదరి తండ్రి గతంలో చేసిన ప్రసంగాన్ని తేజస్వి యాదవ్ ప్రస్తావించారు. 'నరేంద్ర మోదీని సజీవంగా పాతిపెడతానని శకునీ చౌదరి బెదిరించారు. అది బీజేపీ అగ్ర నాయకత్వాన్ని భయపెట్టినట్లుంది, అందుకే ఆయన కుమారుడిని ముఖ్యమంత్రిని చేసి శాంతింపజేసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు. అయితే తేజస్వీ యాదవ్ వ్యాఖ్యలపై అధికార పక్షం నిరసన వ్యక్తం చేసింది. దీంతో సభకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది. సీఎం సామ్రాట్ చౌదరి దీనిపై స్పందించారు. తేజస్వీ వాదనలను ఆయన తోసిపుచ్చారు. 'నేను ఏ పాఠశాల నుంచీ రాలేదు. లాలూ యాదవ్ నన్ను జైలుకు పంపారు' అని అన్నారు. అధికారం ఎవరి హక్కు కాదని నొక్కిచెప్పారు. బీజేపీ, ఎన్డీయేలే తన ఉన్నతికి కారణమని అన్నారు.

# ఇరాన్‌కు ప్రారంభమైన విమాన సర్వీసులు..

**-భారతీయులకు కీలక సూచన జారీ చేసిన ఇండియన్ ఎంబసీ**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 24( మహాప్రభ )**
అమెరికా-ఇరాన్ మధ్య కాల్పులు విరమణ ఒప్పందం అమలవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇండియా నుంచి కూడా ఇరాన్‌కు విమానాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయులు ఇరాన్ పర్యటనను రద్దు చేసుకోవాలని హెచ్చరించింది. భూ మార్గం ద్వారాగానీ, వాయు మార్గం ద్వారాగానీ ఇరాన్ ప్రయాణించడం శ్రేయస్కరం కాదని సూచించింది.ఇరాన్ నుంచి విమాన సర్వీసులు ప్రారంభమైనప్పటికీ.. ప్రస్తుతం నెలకొన్న అనిశ్చిత



పరిస్థితుల దృష్ట్యా, అలాగే కొన్ని దేశాలకు విమాన సర్వీసులు ఇంకా నిలిచిపోయిన నేపథ్యంలో ఇరాన్ ప్రయాణించడం మంచిది కాదని ఇండియన్ ఎంబసీ తెలిపింది. అలాగే, ఇరాన్‌లో ఉన్న ఇండియన్స్ కూడా ఆ దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. ఇందుకోసం తాము సూచించిన సరిహద్దు మార్గాల ద్వారా సురక్షితంగా ఇరాన్ విడిచి వెళ్లాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయంలో సాయం అందిస్తామని ఎంబసీ ప్రకటించింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో ఇండియాన్ ఎంబసీ ఈ ఆదేశాలు జారీ చేసింది. పౌరులు తమను సంప్రదించేందుకు అవసరమైన ఫోన్ నెంబర్లు, మెయిల్ ఐడీలను కూడా ఎంబసీ విడుదల చేసింది. ఇక, ఇరాన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇరాన్ సహా యుద్ధ ప్రభావిత ప్రాంతం నుంచి ఇండియాకు 12 లక్షల మంది వచ్చినట్లు విదేశీ వ్యవహారాల శాఖ గల్ఫ్ విభాగం (ఎంఈఏ గల్ఫ్) తెలిపింది. యూఏఈ, ఇండియా మధ్య విమానాల రాకపోకలు సజావుగా సాగుతున్నాయని ఎంఈఏ గల్ఫ్ సెక్రెటరీ అసీమ్ ఆర్ మహాజన్ తెలిపారు. గురువారం ఒక్క రోజే యూఏఈ నుంచి ఇండియాలోని వివిధ ప్రదేశాలకు మొత్తం 110 విమానాలు ప్రయాణించినట్లు చెప్పారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన 26 మందికి రూ.2,65,000/- జరిమానా

**-డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.20,000/- జరిమానా**

**సిద్దిపేట ఏప్రిల్ 24.(మహాప్రభ)**
సిద్ధిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, తన సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం సిద్ధిపేట పట్టణ పరిసర ప్రాంతాలలో వాహనాలు తనిఖీ చేయగా 26 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా వారిని ఈ వారం రోజులలో లిసిద్ధిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి గారి ముందు హాజరుపరచగా విచారణ చేసి 26 మంది వ్యక్తులకి రూ.2,65,000/- జరిమాన విధించినారు

**డ్రైవింగ్ లైసెన్స్ లేని నలుగురికి రూ.20,000/- జరిమాన విధించినారు**

ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడానికి, ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం




జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వారికి ప్రమాదం మరియు రోడ్డుపై వెళ్లే ఇతర వాహనదారులకు కూడా ప్రమాదమని ప్రమాదాల నివారణ గురించి మాత్రమే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్లో పట్టుబడిన వారిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ గారు విచారణ జరిపి 10 వేల రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. పదివేల రూపాయలు కట్టడం వల్ల మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రజల్లో వాహనదారుల్లో అవగాహన రావడం జరుగుతుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని సూచించారు నడిపినచో ఒక్కొక్కరికి 5000/- రూపాయల జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

## బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

మొదటి తరువాయి

జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

## ఢిల్లీ నుంచి బీజేపీని తరిమేస్తా..

మొదటి తరువాయి

'బీజేపీకి మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ప్రతి ఒక్కరి పేర్లను వారి చిరునామాలతో సహా నేను నమోదు చేసుకుంటున్నా. గుర్తుంచుకోండి మీకు (బీజేపీకి) మమ్మల్ని ఓడించే సత్తా లేదు. మేం అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. మా హక్కుల కోసం పోరాడుతున్నాం. నేను పుట్టింది బెంగాల్‌లో, ఆఖరి శ్వాస తీసుకునేది కూడా బెంగాల్‌లోనే' అని ఆమె అన్నారు. 'నేను అధికార పీఠాన్ని ఆశించను. ఢిల్లీలో బీజేపీని అధికారంలోంచి కూలదోయడమే నా లక్ష్యం. బెంగాల్‌లో వారి పతనం అనివార్యమే అయినప్పటికీ, ఢిల్లీ నుంచి కూడా వారిని కూలదోయాల్సిందే' అని ఆమె పేర్కొన్నారు. అయితే ఆమె ప్రకటనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అపహాస్యం చేశారు.

## ఆర్టీసీ సమ్మెలపై ప్రభుత్వం సానుకూలం

మొదటి తరువాయి

చర్చలు కొనసాగుతున్నాయి. ఆర్టీసీ బోర్డు పరిధిలోని సమస్యలను యాజమాన్యం, ఉద్యోగులు పరిష్కరించుకోవాలని.. ప్రభుత్వ పరిధిలోని అంశాలను పరిష్కరిస్తామని మంత్రులు తెలిపారు.

## చిన్నస్వామిలో కింగ్ షో..

మొదటి తరువాయి

అనంతరం ఆర్సీబీ 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్.. భారీ స్కోరు చేసింది. ఓపెనింగ్ బ్యాటర్ సాయి సుదర్శన్ (100) సెంచరీతో 205/3 స్కోరు చేసింది. ఓ దశలో ఈజీగా 230ం రన్స్ చేసేలా కనిపించిన గుజరాత్‌ను.. ఆర్సీబీ బౌలర్లు తక్కువ స్కోరుకే పరిమితం చేశారు.అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఏ దశలోనూ ఇబ్బంది పడలేదు. మూడో ఓవర్ చివరి బంతికి జాకబ్ బెథెల్ (14) ఔట్ అయ్యాడు. ఈ వికెట్ తర్వాత అసలు విధ్వంసం ప్రారంభమైంది. విరాట్ కోహ్లి (44 బంతుల్లో 81 రన్స్), దేవ్ దత్ పడిక్కల్ (27బంతుల్లో 55 రన్స్) పోటాపోటీగా బౌండరీలు బాదడంతో ఆర్సీబీ విజయం దిశగా అడుగులు వేసింది. వీరిద్దరూ రెండో వికెట్‌కు 59 బంతుల్లో 115 పరుగులు జోడించారు. జట్టుకు విజయాన్ని ఖరారు చేశారు. చివర్లో వికెట్లు పడినా.. కృనాల్ పాండ్యా (12 బంతుల్లో 23 రన్స్) లాంఛనాన్ని పూర్తి చేశాడు. దీంతో ఆర్సీబీ 18.5 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.కాగా ఈ సీజన్‌లో తమ హోమ్ గ్రౌండ్ అయిన బెంగళూరులోని చిన్నస్వామిలో ఆర్సీబీ ఐదు మ్యాచులు ఆడింది. మరో రెండు హోమ్ లీగ్ మ్యాచులను ఆ జట్టు.. రాయ్‌పూర్ వేదికగా ఆడనుంది. చిన్నస్వామిలో ఆడిన ఐదింట్లో ఆర్సీబీ.. నాలుగు మ్యాచులలో గెలుపొందింది. ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో మాత్రం ఓడిపోయింది. ఇక ఈ విజయంతో ఆర్సీబీ.. పాయింట్ల పట్టికలో రెండో ప్లేసుకు దూసుకెళ్లింది. ఆ జట్టు ఖాతాలో ప్రస్తుతం 10 పాయింట్లు.. ౦1.101 నెట్ రన్ రేట్ ఉంది. గుజరాత్ టైటాన్స్.. ఏడు మ్యాచులలో మూడు విజయాలతో ఏడో ప్లేసులో నిలిచింది.

### పశ్చిమ బెంగాల్
## ఎన్నికల్లో విజయం బీజేపీదే

మొదటి తరువాయి

మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో బీజేపీ విజయం తథ్యమన్నారు. రెండో దశలోనూ తామే ఎక్కువ సీట్లు నెగ్గుతామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది బీజీపీనే అంటూ ప్రకటించారు. మమతా బెనర్జీ, టీఎంసీ ప్రభుత్వానికి ఘోర పరాజయం తప్పదని హోంమంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. అందుకు మొదటి దశలో 92.88 శాతం ఓటింగ్ నమోదు కావడమే నిదర్శనమన్నారు. బెంగాల్ ఓటర్లు అభివృద్ధిని ఎంచుకున్నారని తొలి దశ ఎన్నికలతో స్పష్టమైందని చెప్పుకొచ్చారు. బెంగాల్‌లో మార్పు కోసం ప్రజలు ఉత్సాహంగా ఓట్లు వేశారన్నారు. మహిళల రక్షణ బీజేపీ మొదటి ప్రాధాన్యత అని పేర్కొన్నారు. అవినీతిపరులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. బెంగాల్‌లో బీజేపీ, పార్టీ అభ్యర్థులు తమ అంచనాలకు తగినట్లుగా పని చేశారని కితాబిచ్చారు. మరోవైపు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా పోలింగ్ పక్రియను నిర్వహించారంటూ ఎన్నికల సంఘం, స్థానిక పోలీసులు, భద్రతా దళాలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. చాలా కాలం తర్వాత ఒక్కరి ప్రాణం కూడా పోకుండా జరిగిన బెంగాల్ ఎన్నికలు ఇవేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. కాగా, ఈనెల 23న పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీలకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులో 234 స్థానాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం తొలి దశలో 152 స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

## 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

మొదటి తరువాయి

అంబెడ్కర్ సచివాలయంలో పౌర సరఫరాల శాఖాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అడిషనల్ డైరెక్టర్ రోహిత్ సింగ్ డిప్యూటీ కమిషనర్ కొండల్ రావు,జెనరల్ మేనేజర్ ధాన్యం కొనుగోళ్లు,÷నాన్స్,మార్కెటింగ్ లతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరిగినందున అదే స్థాయిలో ముందెన్నడూ లేని రీతిలో ఈ రబీ సీజన్ లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందన్నారు.ధాన్యం కొనుగోలుకు గాను రాష్ట్ర వ్యాప్తంగా 8,500 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఇప్పటికే 5,000 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. 20 జిల్లాల్లో ఇప్పటికే ధాన్యం కొనుగోలు పక్రియ ప్రారంభం అయ్యిందని,సాగు ఆలస్యం అయినందున మరో 13 జిల్లాలో కొనుగోలు పక్రియ ఇంకా మొదలు పెట్టలేదన్నారు. క్షేత్రస్థాయి నుండి వస్తున్న సమాచారం ప్రకారం రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రానుందున అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపి అందుకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు నాలుగు లక్షల 89 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిలువ ఉంచేందుకు గాను 12 లక్షల మెట్రిక్ టన్నులు నిలువ ఉంచేందుకు వీలుగా గోదాములు గుర్తించామని,మరో 20 లక్షల బాయిల్డ్ రైస్ ను నిలువ ఉంచేందుకు గాను జిల్లాల వారీగా కేటాయింపులు జరిపినట్లు ఆయన తెలిపారు.

# ఆర్టీసీ డ్రైవర్ బలిదానం

మొదటి తరువాయి

స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 90 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్



కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆర్టీసీ కార్మికులు ఆందోళన చెందవద్దని క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

**ఇది ప్రభుత్వ హత్యే: బండి సంజయ్**

మరోవైపు డ్రైవర్ మృతిపై కేంద్రమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ ది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పట్టించుకోనందునే ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**బలిదానాలు వద్దు: హరీశ్ రావు పిలుపు**

లిఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసిందని మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు.లి సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ కు ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ లో ఓ పోస్ట్ పంచుకున్నారు.

"హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ఈ ప్రభుత్వ ఆలస్యం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడంవల్లే ఈ దుస్థితి వచ్చింది. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంత మందిని బలి తీసుకుంటావు?

ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును "అపాయింటెడ్ డే" గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరులారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం." అని హరీశ్ రావు ట్వీట్ లో పేర్కొన్నారు.

## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్..

మొదటి తరువాయి

కప్పుకున్నారు. మిగిలిన నలుగురు ఆప్ ఎంపీలు మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, స్వాతీ మలివాల్, రాజీందర్ గుప్తా, విక్రమ్ సాహ్నీ తర్వాత బీజేపీలో చేరతారు. పార్టీలో చేరిన ముగ్గురు ఎంపీలకు నబీన్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన రాఘవ్ చద్దా ఒక పార్టీకి చెందిన మొత్తం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది మరో పార్టీలో విలీనం కావచ్చని రాజ్యాంగం చెబుతున్నదని అన్నారు. రాజ్యసభలో ఆప్‌ను బీజేపీలో విలీనం చేయడానికి సంబంధించి రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు ఒక లేఖ సమర్పించినట్లు చెప్పారు. లేఖతోపాటు అవసరమైన అన్ని పత్రాలను అందచేసినట్లు చద్దా చెప్పారు. ఆప్‌కు చెందిన 10 మంది రాజ్యసభ ఎంపీలలో ఏడుగురు బీజేపీలో చేరితే సంజయ్ సింగ్, సంత్ బల్బీర్ సింగ్ సీచేవాల్, ఎన్‌డీ గుప్తా మాత్రమే మిగులుతారు. మూడింట రెండు వంతుల మంది ఎంపీలు పార్టీ మారితే వారికి పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం వర్తించే అవకాశం లేదు. ఎంపీలు పార్టీని వీడటంపై ఆప్ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ ఎక్స్‌లో స్పందించారు. పంజాబీలకు బీజేపీ మళ్లీ ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఆప్‌పై చద్దా ధ్వజం**

అంతకుముందు, విలేకరుల సమావేశంలో అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్‌తో కలసి విలేకరుల సమావేశంలో పాల్గొన్న రాఘవ్ చద్దా ఆప్ రాజ్యసభ ఎంపీల్లో మూడింట రెండు వంతుల మంది బీజేపీలో విలీనం కావడానికి రాజ్యాంగ నిబంధనలను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆప్‌కు రాజీనామా చేసి తాము కూడా బీజేపీలో చేరనున్నట్లు ప్రదీప్ పాఠక్, అశోక్ మిట్టల్ ప్రకటించారు. తన రక్త స్వేదాలతో పెంచి పోషించిన పార్టీ తన వ్యవస్థాపక సిద్ధాంతాల నుంచి పక్కకు తప్పుకుందని చద్దా చెప్పారు. తన 15 ఏండ్ల యవ్వనాన్ని పార్టీ కోసం ధారపోశానని, ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక సూత్రాల నుంచి వేరుపడిందని ఆయన చెప్పారు. వారి పాపాలలో తాను పాలుపంచుకోలదలచుకోలేదని, వారి నేరంలో తనకు ప్రమేయం లేనందున వారి స్నేహానికి తాను అర్హుడిని కానని ఆయన వ్యాఖ్యానించారు.

**ఏం తక్కువ చేశామని బీజేపీ పంచన చేరావ్: ఆప్ మండిపాటు**

తమ పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ ఎంపీల్లో ఏడుగురు బీజేపీలో చేరిన తర్వాత కూడా బీజేపీ ఆపరేషన్ కమలం చేపడుతున్నదని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్)ఆరోపించింది. తమ ఏడుగురు ఎంపీలను లాక్కునేందుకు ఈడీ, సీబీఐని బీజేపీ ఉపయోగిస్తున్నదని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. చద్దాకు కోరిన పదవులన్నీ ఇచ్చామని, చివరకు బీజేపీ పంచన చేరారని ఆయన విమర్శించారు. భయాన్ని సృష్టించి ఆపరేషన్ కమలాన్ని ప్రారంభించేందుకు బీజేపీ ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుందని ఆయన ఆరోపించారు.

## తెలంగాణలో మరో కొత్త పార్టీ

మొదటి తరువాయి




పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. ఈ సభకు సుమారు 30 వేల మంది జన సమీకరణ చేస్తున్నట్లు జాగృతి శ్రేణులు తెలిపారు .మేడ్చల్ సభలోనే కవిత పార్టీ పేరు జెండా, ఎజెండాను ప్రకటించనున్నారు. కవిత పార్టీ పేరు 'తెలంగాణ ప్రజా జాగృతి', 'తెలంగాణ ప్రజా వికాస సమితి' అంటూ జోరుగా ప్రాచారం సాగుతోంది. ఈమేరకు ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళు లతో కవిత కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. తెలంగాణ జాగృతి పేరుతోనే ఇప్పటికే చేరికలు ప్రారంభమయ్యాయి. బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, పలువురు కార్యకర్తలు కవిత సమక్షంలో పార్టీలో చేరారు. జాగృతి జనం బాట కార్యక్రమంతో పార్టీకి సంబంధించిన గ్రౌండ్ వర్క్‌ను ఆమె పూర్తి చేశారు. అటు అధికార పార్టీ కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ పార్టీ నీ ,మరోవైపు బిజెపిని టార్గెట్ చేస్తూ కామెంట్స్ చేస్తున్నారు కవిత. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు కవిత. కవిత పార్టీ ప్రకటనతో తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు నాంది పలకనున్నారు. ఇంటిపార్టీతో బందం తెంచుకున్న ఆమె తెలంగాణ రాజకీయాల్లో కొత్త జెండా పాతబోతున్నారు. తనకున్న పరిచయాలు, వాక్చాతుర్యంతో ఆమె ముందుకు నడవాలని చూస్తున్నారు. ప్రధానంగా మహిళలను, ఎస్సీ, బిసి వర్గాలను అక్కున చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేసేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

## గర్భాన్ని కొనసాగించాలని ఏ కోర్టూ బలవంతం చేయలేదు

### మైనర్ అబార్షన్‌పై సుప్రీం తీర్పు

**న్యూఢిల్లీ**



ఏ న్యాయస్థానం కూడా ఇష్టం లేకుండా గర్భాన్ని కొనసాగించాలని మహిళను, అందునా ఒక బాలికను బలవంతం చేయలేదని పేర్కొన్న సుప్రీం కోర్టు ఏడు నెలల తన గర్భాన్ని వైద్యపరంగా తొలగించుకోవడానికి 15 ఏండ్ల బాలికకు అనుమతి ఇస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. జన్మించబోయే బిడ్డ ఎంపిక కంటే.. గర్భం దాల్చిన బాలికకే ప్రాధాన్యత ఉంటుందని, అటువంటి గర్భాన్ని కొనసాగించడం వల్ల మైనర్ మానసిక ఆరోగ్యం, విద్యావకాశాలు, సామాజిక హోదా, వివాహంపై దుష్ప్రభావాలు పడే అవకాశం ఉందని జస్టిస్‌లు బీవీ నాగరత్న, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది.మహిళ పునరుత్పత్తి స్వేచ్ఛకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అదే సమయంలో.. ఇష్టంలేని గర్భాన్ని మోస్తున్న మహిళను దానిని కొనసాగించాలని బలవంతం చేస్తే అది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని తెలిపింది. ఈ కేసులో మైనర్ అవాంఛితంగా వచ్చిన గర్భాన్ని కొనసాగించాలని అనుకోవడం లేదని, ఈ విషయం ఆమె రెండుసార్లు ఆత్మహత్యా యత్నాల ద్వారా వెల్లడైందని ధర్మాసనం పేర్కొన్నది.


### ఒక్క నెలలో 46,750
## మందిపై వేటు!

మొదటి తరువాయి

పథకం అమలవుతున్నది. ఈ ఏడాది ద్వితియార్థంలో మరిన్ని కోతలకు ఈ కంపెనీలు సిద్ధమవుతున్నాయి. మెటా సీఈవో జుకర్‌బర్గ్ ఈ విషయమై ఇప్పటికే ఉద్యోగులకు సూచన చేస్తూ ఏఐ వల్ల పెద్ద టీమ్‌ల అవసరం తగ్గొచ్చని తెలిపారు. మరోవైపు వచ్చే నెల్లో మరో 8 వేల మంది ఉద్యోగులను మెటా ఇంటికి పంపనుంది

# సంపాదకీయం

## ప్రజాప్రతినిధులకు జీతాలు ఎందుకు ?



ఉద్యోగుల బకాయిలు ఆరువేల కోట్లకు పైగా చెల్లించాల్సి ఉందని కేబినేట్ భేటీలో చర్చకు వచ్చింది. గత పదేళ్ల కెసిఆర్ పాలనలో, ఇప్పుడు రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో ఇవి అలాగే ఉండిపోయాయి. ఇంకా పెరిగి పోతున్నాయి. అయినా చీమకుట్టినట్లుగా లేదు. ఉచిత పథకాలకు, దుబారా ఖర్చులుకు వెనకాడని ప్రభుత్వం ఉద్యోగుల విషయంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యలే జీతాల్లో 50శాత ఇప్పుడు వీరికి చెల్లిస్తామని, వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగాచెల్లిస్తామని మంత్రులు చెప్పు కొచ్చారు. అసలు మంత్రులు, ఎమ్మెల్యేలకు జీతాలు ఎందుకు? లక్షల్లో వారికి ఎందుకు చెల్లించాలి. ఎందుకు వారికి పెన్షన్లు చెల్లించాలన్నది ఆలోచించాలి. మందు వారి జీతాలను మొత్తంగానే ఆపేయాలి. పెన్షన్లను రద్దు చేయాలి. ప్రజాప్రతినిధులకు లక్షల్లో జీతాలు ఎందుకు? పేరున్న, డబ్బున్న వారు కూడా ఇప్పటికీ పెన్షన్లు పొందుతుననారు. ఎన్నికల సమయంలో ఉచితానుచితాలు మరచి ఎప్పటి కప్పుడు ఆకర్షణీయ పథకాలను గుప్పిస్తున్నారు. అధికారంలో లేన్నప్పుడు ఉచితాల గురించి విమర్శించినవారే, తీరా అధికారంలోకివస్తే అదే ఓటర్లను ఆకట్టుకునేందుకు ఉచిత పథకాలను ఏకరువు పెడుతున్నారు. ఎన్నికల్లో విపరీతంగా డబ్బులు పంచి పెడుతున్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడాని కన్నట్లు ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కదు సరికదా, అత్యవసరంగా లాభపడేది పార్టీలు మాత్రమే. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా కొడుతున్నాయి. జీతాలు ఇవ్వాలంటే మళ్ళీ అప్పులకు దేబిరించాల్సి వస్తోంది. ఉచిత పథకాలతో ప్రజలు సోమరులుగా మారి, పనిచేయడానికి ముందుకు రారని సుప్రీంకోర్టు చేసిన హెచ్చరికను ఎవరూ పట్టించు కున్నట్లు లేదు. అత్యున్నత ధర్మాసనం వ్యాఖ్యలను కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. ప్రజల బతుకులు బాగుపడే శాశ్వత ఆలోచన చేయడమే ప్రభుత్వ కర్తవ్యం కావాలి. ప్రస్తుత పరిస్థితులలో ఓటు కొనుక్కోకూడదు. ఓటు అమ్ముకోకూడదు అని చెబితే వినే వారెవరూ లేరు. దీనికితోడు ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోవడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది.అధికారంలో ఉండగా తెలంగాణను అప్పుల్లో ముంచిన బిఆర్ఎస్ ఇప్పుడు విపక్షంలో ఉంటూ..మరిన్ని ఉచితపథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. తులం బంగారం ఇచ్చారా.. రైతుబంధు వేశారా..పెన్షన్లు నాలుగు వేలు ఇచ్చారా అంటూ నిలదీస్తున్నారు. గురుకులాలు అధ్వానంగా మారడానికి కాంగ్రెస్ కారణమన్నారు. నిజానికి గురుకులాలను లేదా హాస్టళ్లను ఒక్క గొడుగు కిందకు తీసుకుని రావాల్సి ఉంది. విద్య, వైద్యాలకు ఖర్చు చేయకుండా ఉచిత పథకాలకు చేస్తున్న ఖర్చులను వెంటనే ఆపకపోతే జీతాలు ఇవ్వలేరని తేలుతుంది. పెన్షనర్ల బకాయిలు చెల్లించడం లేదు. ఆర్టీసీ సమ్మెకు డబ్బులే కారణం. డబ్బులు ఇవ్వలేక, వారికి చెల్లింపులు చేయలేక,మహాలక్ష్మి పథకంతో దివాళా తీయిస్తూ, ఇవాళ ఆర్టీసీ సమ్మెలో ఓ కార్మికుడిని బలి తీసుకు న్నారు. శంకర్ గౌడ్ మృతి నిజానికి తీవ్ర విషాదం. తెలంగాణ ఉద్యమంలో కూడా ఇలాగే ఆత్మహత్య ల కు కాంగ్రెస్ కారణమయ్యింది. ముందుగా ఆర్టీసీ సమస్యను తేల్చాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. ఎపిలో జగన్ కూడా ఇదే తరహాలో బటన్ నొక్కుడు పథకాలతో దివాళా తీయించారు. చంద్రబాబు కూడా చేతిక ఎముక లేదన్నట్లుగా పథకాలను అందిస్తున్నారు. ఈ పథకాలు కొంపముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉచితాల పంపిణీలపై రాజకీయ నాయకులకు కనువిప్పు

కావాలి. ప్రభుత్వం ద్వారా అన్నీ ఉచితంగా పొందాలనే మనస్తత్వం కారణంగా దేశంలో అభివృద్ధి కుంటుపడిపోతోంది. ఉచిత పథకాలకి ఖజానా ఖాళీ అయిపోతోంది. దానిని నింపడానికి మళ్ళీ అప్పులు. ఈ పద్ధతి ఏ ప్రభుత్వానికీ మంచింది కాదు. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్నాయి. జీతాలు కూడా చెల్లించ లేనప్పుడు మళ్లీ జనం నుంచే వసూలు చేయాలి. ఉచితాలపంపిణీ వలన జనంలో పేదరికం తగ్గిపోయిందని చెప్పడం అలవాటు చేసుకున్నారు. ముఖ్యంగా అధికారంలోకి రావడానికి అనేక విధాలుగా ఉచిత పథకాలపై హామీలు గుప్పిస్తూ, తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. దీనిపై సుప్రీం ధర్మాసనం గట్టిగానే హెచ్చరించినా పట్టింపు లేదు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఎన్నికల సంఘం కూడా దీనిపై దృష్టి సారించాలి. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం మంచి పద్ధతి. ఉచితాలను అమలు చేస్తే ఎక్స్ ప్రెస్ వేలు, విమానాశ్రయాలు, రక్షణ కారిడార్లను నిర్మించచుకోలేం. విద్య, వైద్యం అందించలేం. ఉచితాల విషయమై రాజ్యాంగపరంగా నిషేధాలు విధించడం అవసరమేమో ఆలోచించాలి. భారతదేశ ఆర్థిక పరిస్థితిని ఆందోళనకర స్థాయికి తీసుకెళ్తాయని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. తెలంగాణ, ఎపిల అభివృద్ధికి ఉచిత పథకాలే అడ్డంకిగా మారాయి. తక్షణం వాటిని నివారించడంతో పాటు. ఈ బాధ్యతను కేంద్రప్రభుత్వమే తీసుకోవాలి. జీతాల చెల్లింపు లాంటి రోజువారీ కార్యక్రమాలను ఆపరాదు. అందుకోసం ముందుగా ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపిల జీతభత్యాలను నిలిపివేసే పథకంతో ప్రారంభిస్తే మంచిది.

## నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య కాదు.

# రేవంత్ రెడ్డి ప్రభుత్వం హత్య

**బిఆర్ఎస్ నల్గొండ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్**

**దేవరకొండ ఏప్రిల్ 24( మహాప్రభ )**

-తెలంగాణలో కార్మికుల ప్రాణాలు ఇలా చవకబారిపోయాయా? ఇందుకోసమేనా పోరాడి తెలంగాణ సాధించుకుంది అని బి ఆర్ ఎస్ నల్గొండ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ శాసనసభ్యు లు రామవత్ రవీంద్ర కుమార్

-ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఒక అమాయక ప్రాణం బలైంది ఆయన అన్నారు-రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని ఆయన అన్నారు

-కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలి అని ఆయన డిమాండ్ చేశారు.

-ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి మోసం కార్మికులను మోసం చేసిందని ఆయన తెలిపారు

-40 రోజుల ముందే నోటీసు ఇచ్చినా స్పందించని నిర్లక్ష్యపు ప్రభుత్వం అని ఆయన పేర్కొన్నారు

-ఈ మృతికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే

-ప్రజల కోసం పని చేసే ఆర్టీసీ కార్మికులను ఇంతలా నిర్లక్ష్యం చేయడం దారుణం. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి ప్రాణాలతో ఆడుకుంటోంది అని ఆయన తెలిపారు.

నర్సంపేటలో ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య కాదు అని అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.....తెలంగాణలో కార్మికుల ప్రాణాలు



ఇలా చవకబారిపోయాయా? ఇందుకోసమేనా పోరాడి తెలంగాణ సాధించుకుంది అని ఆయన అడిగారు.ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఒక అమాయక ప్రాణం బలైంది అని ఆయన అన్నారు.రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారు అని ఆయన అన్నారు.ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వం అని ఆయన అన్నారు.కార్మికుల కష్టాలను పట్టించుకోని క్రూర వైఖరి రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని ఆయన తెలిపారు.40 రోజుల ముందే నోటీసు ఇచ్చినా స్పందించని నిర్లక్ష్యపు ప్రభుత్వం అని ఆయన అన్నారు.ఈ మృతికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని ఆయన అన్నారు.ప్రజల కోసం పని చేసే ఆర్టీసీ కార్మికులను ఇంతలా నిర్లక్ష్యం చేయడం దారుణం. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి ప్రాణాలతో ఆడుకుంటోంది అని ఆయన అన్నారు.శంకర్ గౌడ్ కుటుంబానికి తక్షణ న్యాయం చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలి అని ఆయన డిమాండ్ చేశారు.అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసి కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోంది అని ఆయన అన్నారు.ఆర్టీసిని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసి కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలి.రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసి డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుంది అని ఆయన అన్నారు.తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు.ఆర్టీసి కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుంది అని ఆయన తెలిపారు.ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసి కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకు ఉద్యమిద్దాం అని ఆయన తెలిపారు.

# ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి బాధాకరం.

**-మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి..**
**-ఆర్టీసీ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది.**

**మెదక్ జిల్లా -24ఏప్రిల్ (మహాప్రభ )**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొంటూ,మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ దుర్ఘటన వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు.ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన హక్కుల కోసం వారు చేస్తున్న పోరాటం సమంజసమని, అయితే ఆ పోరాటంలో ప్రాణాలను కోల్పోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. “పోరాటం చేయాలి... గెలవాలి... కానీ బతికి ఉండాలి. ఒక వ్యక్తి తీసుకునే తప్పుడు నిర్ణయం మొత్తం కుటుంబాన్ని చీకటిలోకి



నెడుతుంది. మీరే మీ కుటుంబానికి ధైర్యం, మీరే వారి బలం” అని పేర్కొన్నారు.ఆర్టీసీ కార్మికులారా ధైర్యంగా ఉండాలని, ఎలాంటి ఆత్మహత్యల వంటి అతి నిర్ణయాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఎంత పెద్దవైనా, వాటికి పరిష్కారం ప్రాణాలు తీసుకోవడం కాదని, ధైర్యంగా నిలబడి పోరాడితేనే న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి,తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.“ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు. అవి కుటుంబానికి మరింత బాధను మిగుల్చే నిర్ణయాలు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. కలిసి పోరాడుదాం... న్యాయమైన హక్కులను సాధించుకుందాం. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది” అని పునరుద్ఘాటించారు.శంకర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.

## నీటి ఎద్దడి నివారణపై చర్యలు తీసుకోవాలి

**- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**

**మానకొండూర్, ఏప్రిల్ 24: (మహాప్రభ)**





వేసవిలో తాగు, సాగు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎల్ఎండి కాలనీలోని ప్రజాభవన్‌లో మిషన్ భగీరథ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పైపు లీకేజీలను నివారించి నీరు వృథా కాకుండా చూడాలని, ప్రజలకు ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.అదే రోజు తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్‌లో బొప్పు వనిత--సంపత్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ముఖ్య అతిథిగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. తరువాత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించిన ఆయన, నియోజకవర్గంలోని అసంపూర్తి పనులను తక్షణమే పూర్తి చేయాలని, కొత్త పనులకు అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పనులు పూర్తికాక ఆలస్యం అవుతే ప్రజల్లో అపోహలు కలుగుతాయని, అందుకే ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశాల్లో మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన ఇంజనీర్లు, ఎంపీడీవోలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల్లో రికార్డు స్థాయి కూలీల సమీకరణ



**తాడ్వాయి, ఏప్రిల్ 24: (మహాప్రభ)**

తాడ్వాయి మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ( ఎం జి ఎన్ ఆర్ ఈ జి ఎస్) పనుల్లో రికార్డు స్థాయిలో కూలీలను సమీకరించిన సిబ్బందిని అధికారులు అభినందించారు. శుక్రవారం మండల పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏరాపహాడ్ గ్రామానికి చెందిన మేట్ శ్రీహరిని, ప్రత్యేకంగా సన్మానించి రూ.1000 నగదు బహుమతిని అందజేశారు. అలాగే 100 మందికి పైగా కూలీలతో పనులు నిర్వహించిన ఎంద్రియాల్, కృష్ణాజీవాడి, డెమికలాన్, నందివాడ, కన్కల్, గ్రామపంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లను, కూడా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, వెనుకబడిన గ్రామాల్లో కూడా ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి, కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు.పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసి, ప్రతి గ్రామంలో గరిష్ట స్థాయిలో కార్మికులను పనుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధి అవకాశాలను మరింత విస్తరించి గ్రామీణ ప్రజలకు ఆదాయం పెంచడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతిపై హిందూ హక్కుల పోరాట సమితి దిగ్భ్రాంతి

**- రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్.**
**-బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సాగర్**



**దేవరకొండ ఏప్రిల్ 24 ( మహాప్రభ )**
ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ గారి అకాల మృతి పట్ల హిందూ బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ళ సాగర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పగిళ్ళ సాగర్ ప్రభుత్వం ముందు ఈ క్రింది డిమాండ్లను ఉంచారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. 1 కోటి రూపాయల పరిహారం చెల్లించాలి. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా తక్షణమే చర్చలు జరపాలి. కార్మికుల పని ఒత్తిడిని తగ్గించి, వారి న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చడం ద్వారా ఇలాంటి విషాద సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఆర్టీసీ కార్మికులు ఎవరూ అధైర్యపడవద్దని, క్షణికావేశంలో ప్రాణాలు తీసుకునేలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని పగిళ్ళ సాగర్ విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాడదాం కానీ, ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన కోరారు. కార్మికుల పక్షాన హిందూ బిసి హక్కుల పోరాట సమితి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ

**-పట్టణ అధ్యక్షులు వస్కుల సుధాకర్**



**దేవరకొండ ఏప్రిల్ 24( మహాప్రభ )**
దేవరకొండ పట్టణంలో భారతీయ జనతా పార్టీ మున్సిపల్ అధ్యక్షులు వస్కుల సుధాకర్ గారి ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర ప్రజలకు కీలక సేవలు అందిస్తున్నారని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గౌరవించాలని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని, తక్షణమే చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడవద్దని పోరాటాలతో సమస్యలు పరిష్కరించుకోవాలని వారన్నారు ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతల వెంకటేష్ యాదవ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గుండాల అంజయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సముద్రాల సహదేవ్, ఛత్రియాల నాగేంద్ర చిలక రాజు బిక్కు, నీల సుమన్ కర్నాటి వజ్రం కుమార్ చండీశ్వర్, రెడ్డి శంకర్ , , అప్పం అజయ్ , పున్న వెంకటేశ్వర్లు చిత్రం ఉదయ్ సంపంగి సైదులు.అవ్వారి శేఖర్, తదితరులు పాల్గొన్నారు

## ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య...



**పాపన్నపేట ఏప్రిల్24( మహాప్రభ )**
పరీక్షల్లో ఫెయిల్ అవుతానని భయంతో ఉరి వేసుకుని ఓ పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొడ్చన్ పల్లి తండాలో చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు...తండాకు చెందిన బానోత్ సాయిప్రియ(17) కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసింది.పరీక్షలు రాసిన నుంచి ఇంట్లో దిగులుగా ఉంటుంది.దిగులుగా ఉంటున్నావని తల్లి లత అడగగా పరీక్షలు సరిగా రాయలేదని ఫెయిల్ అవుతానని భయం వేస్తుంది అని చెప్పింది.ఫెయిల్ అయినా ఏమీ కాదని ధైర్యంగా ఉండమని తల్లి ధైర్యం చెప్పింది.శుక్రవారం తల్లి లత గ్రామ శివారులో ఆరబోసిన వడ్ల కుప్పల వద్దకు వెళ్లింది.ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న సాయిప్రియ ఫ్యాన్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.కాసేపటికి అన్నం తీసుకురావడానికి వచ్చిన సోదరుడు గమనించి తల్లికి, చుట్టూ పక్కల వారికి సమాచారం అందించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## మెదక్ జిల్లా అదనపు యస్పి గా భాద్యతలు స్వీకరించిన విక్రాంత్ కుమార్ సింగ్.



**మెదక్ జిల్లా -24ఏప్రిల్ (మహాప్రభ**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి బదిలీపై మెదక్ జిల్లాకు అదనపు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన విక్రాంత్ కుమార్ సింగ్ (ఐపీఎస్) శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు (ఐపీఎస్) ని మర్యాదపూర్వకంగా కలసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు సత్వర సేవలందజేత, పోలీస్ శాఖ అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బాలు నాయక్





**దేవరకొండ ఏప్రిల్ 24( మహాప్రభ )**
నియోజకవర్గంలోని గుడిపల్లిమండలంలోని మదాపురం గ్రామానికి చెందిన రామావత్ లక్ష్మి - శంకర్ నాయక్ కుమారుడు వివాహ (రిసెప్షన్)వేడుక మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మదాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి, ఇంటి యాజమానికి హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోదండాపూరం గ్రామంలోని వడ్ల కొనుగోలు వద్ద ఆకస్మికంగా తనిఖీ చేశారు.రైతులు తాము పండించిన పంటను అమ్ముకోవడానికి ఎక్కడికో వెళ్లాల్సిన అవసరం లేకుండా వారి గ్రామాల్లోనే కొనుగోలు సౌకర్యం కల్పించాలన్నదే మా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం అని అన్నారు. రైతులు అష్టకష్టాలు పడి పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించడంతో పాటు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా మేము చర్యలు తీసుకుంటున్నాము అని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తూకం నుంచి నగదు జమ వరకు ప్రతి ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశాము అని వివరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం మరియు రైతుల సంక్షేమమే ధ్యేయంగా మా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుంది అని తెలిపారు.అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే మా అసలైన విజయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సమస్యలు పరిష్కరించాలి:

**-డి.ఆర్.డి.ఏ పీడీకి వినతి**



**దేవరకొండ ( డివిజన్) 24ఏప్రిల్ మహాప్రభ:**
చందంపేట మండలం మూడు దండ్ల గ్రామంలో ఉపాధి హామీ పనుల పిడి గారు పని ప్రదేశంలో పరిశీలన సందర్భంగా కంబాలపల్లి ఆనంద్ ఉపాధి కూలీల కలిసి ఇనాక్టివ్ గా ఉన్న జాబ్ కార్డును ఆక్టివ్ చెసి రెండు పూటల ఫోటోలు విధానాన్ని రద్దు చేయాలని ముఖ్యంగా ఈ కె వై సి చేసుకోపోవటం వల్ల పనికి పోలేకపోతున్నారని ఎండ తీవ్రతంగా ఉండటం వలన పని ప్రదేశంలో టెన్త్ సౌకర్యం మంచినీరు సౌకర్యం వడదెబ్బ రాకుండా ఉండటానికి సమస్యను పరిష్కరించాలని పిడి గారు దృష్టికి తీసుకురావడం జరిగింది పీడి గారు స్పందించి సమస్యను పరిష్కారం కొరకు ఎంపీడీవోలకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది పిడి గారికి కృతజ్ఞతలు తెలుపుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వి బి జి రామ్ జి కొత్త చట్టాన్ని రద్దు చేసి పాత చట్టాన్ని కొనసాగించాలని రెండు పూటలా ఫోటో విధానాన్ని వల్ల సాఫ్ట్వేర్ ప్రారంభంతో ఫోటోలు మార్చు కాకపోవడం కూలీలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఈ విధానాన్ని రద్దు చేయాలని జాబ్ కార్డు మీద 200 రోజులు పని కల్పించాలని రోజు కూలి 800 రూపాయలు ఇవ్వాలని పారలు గడ్డపారలు తట్టలు సప్లై చేసి ఐదు ఐదు కిలోమీటర్ల దూరం వారం తగ్గించి మూడు కిలోమీటర్ల వరకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి మీ ద్వారా విన్నవించుకుంటున్నాం ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య మెట్లు కృష్ణారెడ్డి జంగారెడ్డి కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షాల వల్ల నష్టపోయిన వరి పంటకు పరిహారం ఇవ్వాలని ఆర్డీవోకు వినతిపత్రం

**-బిజెపి పార్టీ పట్టణ అధ్యక్షులు. వస్కుల సుధాకర్**



**దేవరకొండ ఏప్రిల్ 24( మహాప్రభ)**
ఈరోజు భారతీయ జనతా పార్టీ దేవరకొండ మునిసిపల్ శాఖ అధ్యక్షులు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని పర్వతరావు చెరువు వెనుక ప్రాంతంలో అకాల వర్షాల కారణంగా రైతులు పండించిన వరి పంట తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, రైతులతో కలిసి ఆర్డీవో గారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వెంటనే అధికారులు స్పందించి నష్టాన్ని అంచనా వేసి, ప్రభావిత రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులు దేశానికి వెన్నెముకలని, వారి కష్టాలను ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నేతల వెంకటేష్ యాదవ్, బిజెపి జిల్లా కౌన్సిలింగ్ మెంబర్ , గుండాల అంజయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శులు, సముద్రాల సహదేవ్ చిత్రాల నాగేంద్ర, చిలక రాజు బిక్కు, నీల సుమన్, వజ్ర కుమార్ , చండీశ్వర్, రెడ్డి శంకర్, ఎర్ర బిక్షపతిఅప్పం అజయ్, పున్న వెంకటేశ్వర్లు చిత్రం ఉదయ్, పున్న నాగరాజు, సంపంగి సైదులు బిజెపి నాయకులు, కార్యకర్తలు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆత్మహుతి కాదు ప్రభుత్వ హత్య.

**-కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి**
**-సామాజికవేత్త శ్రీనివాస్ గౌడ్**




**దేవరకొండ ఏప్రిల్ 24( మహాప్రభ)**
దేవరకొండ పట్టణంలో తెలంగాణ ఆర్టీసీ కార్మికుల మూడవరోజు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించినారు. ఆర్టీసీ అన్ని కార్మిక సంఘాలు జేఏసీ సంఘాలు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా సామాజికవేత్త బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ ర్యాలీలో పాల్గొని కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ జిల్లా నర్సంపేట డిపోలో ఆత్మహుతి చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి విషాదకరం. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆత్మహత్యలు వద్దు ఆత్మాభిమానం ముద్దు, తను చాలించకు సమస్యతో తలపడు. అని కార్మికుల లోకానికి చెప్పారు. ఆత్మహుతి కాదు ప్రభుత్వ హత్య నే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి టిఎస్ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తానని, నూతన పిఆర్సిని ప్రకటిస్తామని, ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, కార్మికుల యొక్క అన్ని డిమాండ్లను పరిష్కరిస్తామని పరిష్కరించకపోవడం వలన కార్మికులను మోసం చేసినట్లే అని వెంటనే ప్రభుత్వం పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసి సాధించుకుంటామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, టీజీ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఇరుగదిశీడల శ్రీను, వైఎస్ చైర్మన్ ఓరుగంటి రమేష్ గౌడ్, గడ్డం రాజేందర్ గౌడ్, నాగమణి,యాదమ్మ ,పుష్పలత, సుస్మిత, పున్న బిక్షమయ్య, యాదయ్య చారి, విజయమ్మ, రంజాన్ బేక్, చెరుకు అంజి తదితరులు పాల్గొన్నారు

## గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు

**-దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**




**దేవరకొండ ఏప్రిల్ 24( మహాప్రభ )**
గ్రామాలే దేశాభివృద్ధికి పట్టుగొమ్మలు - అనే సత్యాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. ప్రజాప్రభుత్వం అందుకు కట్టుబడి పనిచేస్తుంది. స్థానిక స్వపరిపాలనకు ప్రతీకలైన పంచాయతీలు బలంగా, సమర్థవంతంగా పనిచేసినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది అని ఆయన అన్నారు. భారత రాజ్యాంగంలోని 73వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా స్థానిక సంస్థలకు లభించిన స్వయం పరిపాలన హక్కులు ప్రజాస్వామిక వికేంద్రీకరణకు దిశానిర్దేశం చేశాయి. సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పంచాయతీ రాజ్ సంస్థలు సాధికారత, సామర్థ్యం, జవాబుదారీతనం పెంపొందించుకోవడం అత్యంత అవసరం అని ఆయన చెప్పారు. స్థానిక స్వయం పరిపాలన గ్రామీణ ప్రజల జీవితాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పులతో పాటు స్వయం సమృద్ధి దిశగా గ్రామీణ భారతదేశాన్ని ముందుకు నడిపిస్తుంది" అని ఎమ్మెల్యే ఒక సందేశంలో పేర్కొన్నారు.

# శంకర్ గౌడ్ అమరుడైన రోజును "అపాయింటెడ్ డే"గా ప్రకటించాలి

**-జనసేన నాయకులు చందు నాయక్**





**దేవరకొండ డివిజన్ ఏప్రిల్ 24(మహాప్రభ )**
ఆర్టీసీ కార్మిక శంకర్ గౌడ్ ఆత్మబలిదానం తీవ్రంగా కలిచివేస్తుంది జనసేన పార్టీ ముఖ్య నాయకులు చందు నాయక్ శనివారంవిలేకరులకు ప్రకటన విడుదల చేస్తూ సంస్థను కాపాడేందుకు కార్మికుల హక్కుల కోసం ప్రాణ త్యాగం చేసిన శంకర్ గౌడ్ కు ఘన నివాళులు అర్పిస్తూ హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప ఇలాంటి ఆత్మా బలిదానాలకు ఎవ్వరూ వడిగట్ట వద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దే బాధ్యత ఈ ప్రభుత్వ ఆలసత్వం నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వలన ఈ దుస్థితి వచ్చింది మేనిఫెస్టో ఇచ్చిన వాగ్దానాలు సైతం అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతూ రేవంత్ రెడ్డి ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు ఆర్టీసీ కార్మికుల న్యాయం ఆవేదన పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిశీలించాలని చర్యలు ప్రారంభించి కార్మికుల విశ్వాసం కల్పించాలి శంకర్ గౌడ్ అమరుడైన రోజును అపాయింట్మెంట్ "డే గా ప్రకటించి ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నాం ఆర్టిసి కార్మిక సోదరులారా మీరు చేసిన పోరాటానికి మేము అంతా అండంగా ఉన్నాం. భయానికి లోను కాకండి కలిసికట్టుగా న్యాయబద్ధంగా పోరాడుదాం తెలంగాణలో ఆర్టీసీ కార్మికుల గోసను జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ గారి దృష్టికి తీసుకువెళ్లే విధంగా రాష్ట్రస్థాయి నాయకులతో చర్చిస్తామని జనసేన పార్టీ ఆర్టీసీ సంస్థను కాపాడుకునే విధంగా కృషి చేస్తామని చందు నాయక్ అన్నారు

# కూకట్పల్లి కాంగ్రెస్ సీనియర్ నేత పట్లోళ్ల నాగిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**కూకట్పల్లి,ఏప్రిల్ 24 (మహా ప్రభ)**
కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, బ్లాక్ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి జన్మదిన కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయం శ్రీ హేమ దుర్గ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నాగిరెడ్డికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాట్లాడుతూ బండి రమేష్, పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీకి అంకితభావంతో సేవలందిస్తూ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న నాగిరెడ్డి పార్టీ నాయకులు, యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. భవిష్యత్తులో పార్టీ లో మరిన్ని ఉన్నత పదవులు పొందుతూ మార్గదర్శకంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, పుష్ప రెడ్డి, తూము వేణు, ప్రకాష్ ముదిరాజ్, రాజేందర్, రాము, అస్లాం, కొండల్, కుమారస్వామి, వినోద్, అక్బర్, జగదీష్, సాయి తులసి తదితరులు పాల్గొన్నారు.

# బావిలో పడి కూలీ మృతి



**తాడ్వాయి, ఏప్రిల్ 24:(మహాప్రభ)**
మండలంలోని డెమికలాన్ గ్రామ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డ సుధాకర్ (36) అనే కూలీ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. వివరాల ప్రకారం... సుధాకర్ అశన్నగారి మహిపాల్ రెడ్డి వ్యవసాయ పొలంలో పనికి వెళ్లాడు. బావిలో మోటార్‌ను దింపుతున్న సమయంలో ఒక చేతితో మోటార్‌ను, మరో చేతితో తాడును పట్టుకుని ఉండగా, ప్రమాదవశాత్తు తాడు చేతిలో నుంచి జారిపోయింది. దీంతో మోటార్‌తో పాటు సుధాకర్ బావిలో పడిపోయాడు. బావిలోని బురద నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీయించి పంచనామా నిర్వహించారు. మృతుడి భార్య గడ్డ రజిత (30) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# కుటుంబ సభ్యులకు పరామర్శించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ ఆర్థిక సాయం



**గాంధారి, ఏప్రిల్ 24 (మహాప్రభ)**
కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రానికి చెందిన సయ్యద్ అల్తాఫ్, ఇటీవల కాలంలో మరణించిన సంఘటన తెలుసుకొని వారి కుటుంబసభ్యులను పరామర్శించి 50వేల రూపాయల ఆర్థిక సహాయం చేసిన కుటుంబ సభ్యులకి సయ్యద్ హైమద్, వారి తల్లి కి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, ఆర్థిక సాయం అందించాడు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్, షేరు, అంజాద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ విచారణకు కేంద్రం ఎందుకు జాప్యం చేస్తోంది?

**కాంగ్రెస్ నేత మదన్ మోహన్ నిలదీత**



**కూకట్పల్లి , ఏప్రిల్ 24 (మహాప్రభ)**
లక్ష కోట్ల ప్రజాధనం ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన భారీ అవినీతి, అక్రమాలపై కేంద్ర ప్రభుత్వం సిబిఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు అని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ప్రశ్నిస్తోంది.

**ప్రధాన అంశాలు:**

1. బిజెపి బిఆర్ఎస్ రహస్య దోస్తీ: తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలాగా మాట్లాడుతున్న బిజెపి, కాళేశ్వరం అవినీతి విషయానికి వచ్చేసరికి మౌనం వహించడం వెనుక బిఆర్ఎస్ తో కుదిరిన "ఫెవికల్" బంధం లాంటి రహస్య ఒప్పందం స్పష్టంగా కనిపిస్తోంది. కేసిఆర్ కుటుంబాన్ని కాపాడేందుకే కేంద్రం సిబిఐ విచారణ వేయడం లేదు.
2. డబుల్ స్టాండర్డ్స్: దేశంలో ఇతర రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలైన కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్,మనీష్ సిసోడియా, జె.యం.యం పార్టీ అధినేత .హేమంత సురేన్, బెంగాల్ లోని త్రినమూల్ కాంగ్రెస్ పార్టీ నేతల ,ఎన్.సి.పి. అధినేత శరద్ పవార్, యస్.పి. అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్.జే.డి. అధినేత లాలూ ప్రసాద్ యాదవ్,డి.యం.కే. నేతల పైన ఈడి, సిబిఐ, ఐటి దాడులు చేయించే కేంద్ర ప్రభుత్వం, తెలంగాణలో మాత్రం లక్ష కోట్ల రూపాయల కాళేశ్వరం వంటి అతిపెద్ద కుంభకోణంపై చర్యలు తీసుకోకపోవడం దేనికి సంకేతం? ఇక్కడే బిజెపి ద్వంద్వ వైఖరి బట్టబయలు అయింది.
3. రాష్ట్ర ప్రభుత్వం కోరినా స్పందన లేదు: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాళేశ్వరం అక్రమాలపై సిబిఐ విచారణ కోరుతూ కేంద్రానికి లేఖ రాసింది. విజిలెన్స్ నివేదికలు, కాగ్ నివేదికలు సాక్ష్యంగా ఉన్నా కేంద్రం కళ్లు మూసుకుని కూర్చుంది.
4. ప్రజాధనం లూటీపై మౌనం ఎందుకు: మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్లకు నష్టం వాటిల్లడం, నాణ్యత లేని పనులు, అంచనాలు పెంచడం వంటి అంశాలన్నీ బయటపడ్డాయి. ఇంత జరిగినా సిబిఐ విచారణ వేయకపోతే బిజెపి, బి.ఆర్.యస్. చేసిన అవినీతికి కొమ్ముకాస్తున్నట్టే.
5. తెలంగాణ ప్రజలను మోసం చేయడం: ఎన్నికల ముందు కాళేశ్వరం అవినీతిపైనస్వయాన ప్రధాన మంత్రి హైదరాబాద్ లో జరిగిన బహిరంగ సభలో.. కాళేశ్వరం కేసిఆర్ కుటుంబానికీ ఏ.టి.యం. గా మారిందని చెప్పారు...
6. పెద్ద పెద్ద మాటలు చెప్పిన బిజెపి నేతలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదు? తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది: కేంద్ర ప్రభుత్వం వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు అక్రమాలపై సిబిఐ విచారణకు ఆదేశించాలి. లక్ష కోట్ల ప్రజాధనం లూటీకి బాధ్యులైన వారిని శిక్షించాలి. లేకపోతే బిజెపి, బిఆర్ఎస్ ల"ఫెవికల్ బంధం" నిజమేనని తెలంగాణ ప్రజలు తేల్చుకుంటారు.

అవినీతిపై పోరాటం అంటే ప్రతిపక్ష రాష్ట్రాలపై దాడులు చేయడం కాదు. మిత్రపక్షాలను కూడా ప్రశ్నించే దమ్ముండాలి. అది బిజెపికి లేదు.

ఇట్లు
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి
మదన్ మోహన్...

# కాంగ్రెస్ నాయకులపై దాడులు అనైతికం

**- ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదు :**
**-టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్**



**కూకట్పల్లి, ఏప్రిల్ 24 (మహాప్రభ)**
నిన్న కాంగ్రెస్ పార్టీ నాయకునిపై బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు చేసిన దాడి ఘటనపై టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ తీవ్రంగా స్పందించారు.
కాంగ్రెస్ పార్టీ నాయకులు లేదా కార్యకర్తల జోలికి వస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. పార్టీ పరమైన విమర్శలు ఉంటే వాటిని రాజకీయంగా ఖండించాలి లేదా నిజాలను నిరూపించుకోవాలి తప్ప దాడులకు దిగడం పూర్తిగా అనైతికమని పేర్కొన్నారు. మా సోషల్ మీడియా కోఆర్డినేటర్ తాయారు ఎటువంటి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయలేదని, ఎవరో ఫార్వర్డ్ చేసిన అంశాన్ని ట్రోల్ చేసినందుకు దాడులకు పాల్పడటం సభ్యతకు, రాజకీయ సంస్కృతికి విరుద్ధమని అన్నారు. గత ప్రభుత్వంలో బాధ్యతాయుతమైన పదవులు నిర్వహించిన నాయకులు ఇలాంటి చర్యలకు దిగడం సరైంది కాదని, తమ రాజకీయ మూలాలను మరచిపోవద్దని సూచించారు. ఇంకొక బి ఆర్ ఎస్ నాయకుడు సోషల్ మీడియాలో ఇంటిలోకి దూరి దాడి చేస్తామని చేసిన వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అనైతిక రాజకీయాలు చేయాలనుకుంటే ఇప్పటికే ప్రతిస్పందించేదని, కానీ విలువల రాజకీయాలకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ ఘటనలో కూకట్పల్లి పోలీసులు వెంటనే స్పందించి నిందితులను అరెస్ట్ చేసి చర్యలు తీసుకున్నందుకు పోలీస్ శాఖకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ పార్టీ శ్రేణులందరూ సంఘటితంగా ముందుకు వచ్చి అండగా నిలిచినందుకు కార్యకర్తలకు అభినందనలు తెలిపారు..

# మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి:

**-మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**






**మెదక్ జిల్లా, 24ఏప్రిల్ (మహాప్రభ )**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సంక్షేమ వారంలో భాగంగా శు క్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రజావాణి హాల్ నందు యస్, యస్టి, బిసి మరియు మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వివిధ కళాశాలల నుంచి ఇంటర్మీడియట్ ,డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు మరియు స్వయం ఉపాధి పథకాల అమలుపై ఎస్సీ సంక్షేమ అధికారి డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రకాష్ రావు, తో కలిసి యువతకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ యస్, ఎస్టీ, బిసి మైనారిటీ యువతకు సాంకేతిక మరియు వ్యవస్థాపక నైపుణ్యాలలో (టెక్నికల్ ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చేసిందని మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచానికి దీటుగా నిలబడాలంటే కంప్యూటర్ కోర్సులలో ప్రతిభావంతులై ఉండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువత లబ్ధి పొందాలన్నారు. అంతకుముందు ఐటీసీ సంస్థ నుండి ప్లాంట్ మేనేజర్ ఆనంద్, టెక్నీషియన్ శివయ్య నైపుణ్యత శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందే విధానంపై సమగ్రంగా వివరించారు. ఐ.టీ.సీ సంస్థలో 50 ఉద్యోగాలు కలవని వివరించడం జరిగింది. సంబంధిత యువత నుండి ఉద్యోగ అర్హత పత్రాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, యువత పాల్గొన్నారు.

# నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

**మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా -24ఏప్రిల్ (మహాప్రభ ).**
మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలో శు క్రవారం పండుగ వాతావరణంలో లబ్ధిదారుల ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో కలెక్టర్. పాల్గొన్నారు ఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని ఈ కార్యక్రమంలో భాగంగా శివాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తోట లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పక్కాగా పారదర్శకంగాజరుగుతుందన్నారు సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మల నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, హౌసింగ్ పీడీ మాణిక్యం, సర్పంచ్ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై వినూత్న అవగాహన

**హుస్నాబాద్, ఏప్రిల్ 24 (మహాప్రభ ).**
హుస్నాబాద్‌లో ట్రాఫిక్ పోలీసులు వినూత్నంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ మొగిలి నాయక్ హ్యాండ్ మైక్ ద్వారా పాట రూపంలో వాహనదారులకు సందేశం అందిస్తూ ప్రధాన కూడళ్ల వద్ద నిలబడి "వేగం కన్నా ప్రాణం మిన్న" అనే ప్రత్యేక గీతంతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాలపై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించరాదని సూచించారు. ఈ వినూత్న ప్రయత్నం వాహనదారుల్లో మంచి స్పందన పొందుతోంది.

# బిజినెస్

## 982 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్..

### ఒక్కరోజే రూ.4 లక్షల కోట్లు నష్టం




భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ 983 పాయింట్లు, నిఫ్టీ 275 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,483.80 పాయింట్ల వద్ద నష్టంతోనే ప్రారంభమైంది. రోజంతా ట్రేడింగ్ మొత్తం నష్టాల్లోనే కొనసాగింది. ఏ దశలోనూ పుంజుకోలేదు. ఇంట్రాడేలో 76,403.87 వద్ద కనిష్ట స్థాయికి చేరింది. చివరకు 982.71 పాయింట్ల (1.27%) నష్టంతో 76,681.29 పాయింట్ల వద్ద ముగిసింది.ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 275.10 పాయింట్ల (1.14%) నష్టంతో 23,879.95 వద్ద ముగిసింది. బీఎస్ఈకి సంబంధించి ఒక్క రోజులోనే లిస్టెడ్ కంపెనీల విలువ భారీగా తగ్గింది. రూ.4 లక్షల కోట్లు నష్టపోయి రూ.461 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, సన్ ఫార్మా, టెక్ మహీంద్రా సంస్థలు నష్టాలు చవిచూశాయి. ఇందులో ఇన్ఫోసిస్ షేర్లు 7 శాతం పడిపోయాయి. ట్రెంట్, బజాజ్ ఫైనాన్స్, కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్బీఐ లాభాలు చవిచూశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 107.12 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4681 డాలర్ల వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 94.25గా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఇంకా తగ్గకపోవడం, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్ నష్టాలకు కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

## రికార్డు స్థాయిలో మారుతి కార్ల ఉత్పత్తి




న్యూఢిల్లీ,

కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ మరో రికార్డును సృష్టించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సంస్థ 23.4 లక్షల యూనిట్ల వాహనాలను ఉత్పత్తి చేసింది. ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో వాహనాలను ఉత్పత్తి చేయడం ఇదే తొలిసారని కంపెనీ పేర్కొంది. కేవలం ప్యాసింజర్ వాహనాలను భారత్‌కు తయారు చేసి ఈ రికార్డు నెలకొల్పినట్టు దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా వెల్లడించింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో హిసాచి తకేచి మాట్లాడుతూ..ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో కార్లను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ ఒకే దేశంలో ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో ఉత్పత్తి జరుపడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. జీఎస్టీ 2.0ని ప్రకటించడంతోపాటు మార్కెట్లు మరింత బలోపేతం కావడం, చిన్న స్థాయి కార్లకు పెరుగుతున్న డిమాండ్‌తో కార్ల అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ఏటా ఉత్పత్తి సామర్థ్యాన్ని 40 లక్షలకు పెంచుకునేయోచనలో ఉన్నట్టు ఆయన తెలిపారు. గతేడాది డిజైర్, ఫ్రాంక్స్, స్విఫ్ట్, ఎర్టిగా, బాలెనో మాడళ్లు అత్యధికంగా అమ్ముడయ్యాయి. ప్రస్తుతం సంస్థకు దేశవ్యాప్తంగా నాలుగు ఉత్పత్తి కేంద్రాలు ఉండగా, ఐదో ప్లాంట్ త్వరలో అందుబాటులోకి రాబోతున్నది.

## ఇదే మంచి ఛాన్స్.. తగ్గిన బంగారం ధరలు

బంగారం కొనాలనుకునే వారికి గోల్డెన్ ఛాన్స్. దేశీయ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా నాలుగో రోజూ తగ్గాయి. వెండి రేటు రూ.15000 వరకు తగ్గింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు, ముడి చమురు ధరలు, డాలర్ వంటి కారణాలు బంగారం ధరలు తగ్గేలా చేస్తున్నాయి. ఏప్రిల్ 24 శుక్రవారం ఉదయం 10 గంటలకు జాతీయ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం రూ.600 వరకు తగ్గింది. కేజీ వెండిపై రూ.100 మాత్రమే తగ్గింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు ఎప్పుడు పడుతుందోనని భారత్ వంటి చాలా దేశాలు ఎదురుచూస్తున్నాయి. చమురు, గ్యాస్ సహా పలు వస్తువుల దిగుమతుల్లో అంతరాయాలు ఏర్పడి ఇబ్బందులు పడుతున్నాయి. అయితే ఇరాన్- అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడం కాస్త ఉపశమనం లభించినట్లయింది. అయితే, ఆ తర్వాత అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు బులియన్ మార్కెట్ పై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. సాధారణంగా ఉద్రిక్తతలు ఉంటే ధరలు పెరుగుతాయి. కానీ, ఇరాన్ యుద్ధం సమయంలో ఊహించని విధంగా బంగారం ధరలు మారుతుండడం గమనార్హం. ప్రధానంగా ట్రంప్ చేసే ప్రకటనలు బంగారం ధరలను నడిపిస్తున్నాయని చెప్పవచ్చు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ సహా పలు కేంద్ర బ్యాంకులు ద్రవ్యోల్బణం కట్టడికి ఇప్పట్లో వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం లేదన్న అంచనాలూ బంగారంలోని పెట్టుబడులను ఇతర మార్గాలకు మళ్లిస్తున్నాయి. అలాగే రష్యా భారీగా బంగారం విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్లోకి ఒక్కసారిగా బంగారం రావడం సైతం ధరలు తగ్గేందుకు కారణమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పడిపోతున్నాయి. ఈరోజు



ఏప్రిల్ 24న స్పాట్ గోల్డ్ ఔన్సుకు 30 డాలర్లకు పైగా తగ్గింది. దీంతో ఔన్స్ బంగారం రేటు ఇవాళ 4675 డాలర్ల స్థాయికి దిగివచ్చింది. ఇక స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 0.53 శాతం తగ్గి 75 డాలర్ల వద్దకు పడిపోయింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు వరుసగా నాలుగో రోజూ దిగివచ్చాయి. నాలుగు రోజుల్లో తులం బంగారం రేటు రూ. 2800 మేర పడిపోయింది. ఇక ఈరోజు 24 క్యారెట్ల బంగారం రేటు మరో రూ. 600 మేర పడిపోయింది. దీంతో 10 గ్రాములు బంగారం రేటు రూ. 1,52,950 వద్దకు దిగివచ్చింది. అలాగే 22 క్యారెట్ల ఆభరణాల బంగారం రేటు 10 గ్రాములకు రూ. 550 మేర తగ్గడంతో తులం రేటు రూ. 1,40,200 వద్దకు పడిపోయింది.

పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా గత కొన్ని రోజులుగా బంగారం, వెండి ధరలు ఆకాశాన్నంటాయి. ఒకనొక సందర్భంలో పసిడి ధరలు ఆల్‌టైం హైకి రూ.2లక్షలకు చేరువలోకి వెళ్లగా, కేజీ వెండి రూ.4,25,000కు చేరింది. ఎలక్ట్రికల్స్-ఎలక్ట్రానిక్స్, ఆటో-ఎలక్ట్రిక్ వెహికిల్స్, సోలార్ ఎనర్జీ, సెమీకండక్టర్, మెడిసిన్, బ్యాటరీలు, సోలార్ ప్యానెల్‌లు, ఏరోనాటికల్ ఇంజనీరింగ్ వంటి వివిధ రంగాలలో వెండి వినియోగం బాగా పెరగడం, వెండి మీద పెట్టుబడి పెట్టే వారి సంఖ్య కూడా ప్రపంచవ్యాప్తంగా భారీగా పెరగటంతో అప్పట్లో ఈ డిమాండ్ ఏర్పడింది. బంగారంతో పోల్చితే వెండి నాణ్యత అధికం కావడం, అందులో వేస్టేజ్ అనేది ఉండకపోవటంతో బార్స్ రూపంలో వెండిని కొనేవారి సంఖ్య బాగా పెరిగారు. కొందరు ఈటీఎఫ్ రూపంలోనూ వెండిపై పెట్టుబడి పెట్టడంతో అప్పట్లో వెండి ధర ఆకాశాన్ని అంటింది. కానీ యుద్ధం మొదలయ్యే నాటికే వెండి ధర క్రమంగా పతనమవుతూ వచ్చింది. అయితే.. గత రెండ్రోజుల్లో బంగారంతో పాటు వెండి రేటు వరుసగా పడిపోతోంది. గత నాలుగు సెషన్లలో కిలో వెండి రేటు రూ.15000 మేర దిగివచ్చింది. ఇవాళ ఒక్కరోజే రూ. 5000 మేర తగ్గింది. దీంతో హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ. 2,65,000 వద్దకు దిగివచ్చింది. హైదరాబాద్ సహా దేశ వ్యాప్తంగా బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం. హైదరాబాద్: 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,200 ఉంది.విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,52,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,200 ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,100 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,40,350 ఉంది.

# స్పోర్ట్స్

## కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి..




సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులకు శుభవార్త. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్‌తో కీలక పోరుకు ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం నిజంగా గుడ్ న్యూసే.(ఏప్రిల్ 25) రాజస్థాన్ రాయల్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్ లో తాను బరిలోకి దిగుతున్నానని స్వయంగా ప్యాట్ కమిన్స్ ప్రకటించడం గమనార్హం. ఈ మేరకు కమిన్ ఇన్ స్టాలో పోస్ట్ పెట్టాడు.కమిన్స్ తన ఇన్ స్టాలో పూర్తిస్థాయిలో బౌలింగ్ చేస్తూ కనిపించిన చిత్రాలను పంచుకుంటూ, "చాలా కాలం తర్వాత వస్తున్నాను, రేపు మళ్లీ మైదానంలోకి దిగడానికి ఆతృతగా ఉన్నాను," అని రాశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీ కూడా 'వస్తున్నాడు' అంటూ ఎక్స్ వేదికగా కమిన్స్ ఫోటోను షేర్ చేసింది. ఈ సీజన్‌లో తొలి ఏడు మ్యాచ్‌లకు దూరమయ్యాక అతని ఈ ఉత్సాహం స్పష్టమైంది. అతని జట్టు సహచరుడు ట్రావిస్ హెడ్ "ఈ ఏఐ చిత్రాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయి" అని సరదాగా వ్యాఖ్యానించాడు.కమిన్స్ లేకపోవడంతో ఇషాన్ కిషన్ సన్‌రైజర్స్‌కు ఐపీఎల్ కెప్టెన్‌గా నాయకత్వం వహించాడు. కాగా, గతేడాది జులై నుంచి వెన్ను గాయంతో బాధపడుతున్న ఈ ఆస్ట్రేలియా ఆటగాడు టీ20 ప్రపంచ కప్‌కు దూరమయ్యాడు. ఆ తర్వాత డిసెంబర్‌లో ఒకే యాషెస్ టెస్టులో మాత్రమే కనిపించాడు. ప్యాట్ కమిన్స్ పేస్ బౌలింగ్, నాయకత్వ సామర్థ్యాలకు ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా, ఈ సుదీర్ఘ విరామం జాతీయ జట్టుకూ, ఫ్రాంచైజీకి ఆందోళన కలిగించింది. మార్చి 27న జట్టుతో చేరినప్పటికీ.. ఏప్రిల్ 4న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో మ్యాచ్ తర్వాత చివరి వైద్య పరీక్షల కోసం స్వదేశం వెళ్ళాడు. ఆస్ట్రేలియాలో ఫిట్‌నెస్ పరీక్షను పూర్తి చేసుకుని, ఇప్పుడు సన్‌రైజర్స్ తరపున తిరిగి రంగప్రవేశం చేస్తున్నాడు.సన్‌రైజర్స్ ప్రారంభంలో మొదటి 4 మ్యాచ్‌లలో మూడు ఓడిపోయి.. అనంతరం వరుసగా 3 విజయాలతో పుంజుకున్నారు. అంటే 7 మ్యాచ్ లలో 4 గెలిచి 8 పాయింట్లు, ం0.820 నెట్ రన్ రేట్‌తో పాయింట్ల పట్టికలో టాప్ ఫోర్‌లోకి దూసుకెళ్లారు.ఢిల్లీ క్యాపిటల్స్‌పై సాధించిన 47 పరుగుల తేడాతో విజయం తర్వాత సన్‌రైజర్స్ ఈ మ్యాచ్‌లోకి వస్తోంది. ఆ మ్యాచ్‌లో హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో అభిషేక్ శర్మ అజేయంగా 135 పరుగులు చేసి అద్భుత ప్రదర్శన కనబరిచాడు. ఈ విజయ ఉత్సాహంలో వారు రియాన్ పరాగ్ నాయకత్వంలోని రాజస్థాన్ రాయల్స్‌ను ఎదుర్కోనున్నారు.


...

## చెన్నైకి శాపంగా మారిన రుతురాజ్ గైక్వాడ్



చెన్నై సూపర్ కింగ్స్ జట్టు ముంబై ఇండియన్స్‌ను 103 పరుగుల భారీ తేడాతో చిత్తు చేసింది. జట్టు మొత్తం సమష్టిగా రాణించినా, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాత్రం కేవలం 14 బంతుల్లో 22 పరుగులు చేసి వెనుదిరిగాడు. అల్లా గజన్‌ఫర్ బౌలింగ్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి అవుట్ కావడంతో, ఒక స్టార్ ఓపెనర్‌గా ఆయన బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడలేకపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గైక్వాడ్ వైఫల్యం జట్టు బ్యాటింగ్ ఆరంభాన్ని బలహీనపరుస్తోంది.ప్రస్తుత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్ గణాంకాలు చూస్తే ఎవరైనా విస్తుపోవాల్సిందే. ఈ ఏడాది ఆడిన 7 ఇన్నింగ్స్‌ల్లో ఆయన వరుసగా 6, 28, 7, 15, 7, 19, 22 పరుగులు మాత్రమే చేశారు. అంటే మొత్తం 7 మ్యాచ్‌ల్లో కలిపి కేవలం 104 పరుగులు మాత్రమే సాధించాడు. ఆయన సగటు కేవలం 14.86గా ఉండటం విశేషం. కనీసం ఐదు ఇన్నింగ్స్‌లు ఆడిన ఓపెనర్లలో అత్యంత తక్కువ సగటు కలిగిన ఆటగాడిగా గైక్వాడ్ అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. ఆయన స్ట్రైక్ రేట్ కూడా 120 లోపే ఉండటం గమనార్హం.ఒకవైపు గైక్వాడ్ ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతుంటే, అదే జట్టులో సంజూ శామ్సన్ పరుగుల విధ్వంసం సృష్టిస్తున్నాడు. శామ్సన్ ఇప్పటివరకు ఆడిన 7 మ్యాచ్‌ల్లో 58.60 సగటుతో ఏకంగా 293 పరుగులు చేశాడు. ఇందులో రెండు మెరుపు శతకాలు కూడా ఉండటం విశేషం. శామ్సన్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటంతో, వచ్చే సీజన్ నాటికి చెన్నై జట్టు నాయకత్వ బాధ్యతలను ఆయనకు అప్పగించే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నాడు. 31 ఏళ్ల శామ్సన్ నాయకత్వ లక్షణాలు కూడా గైక్వాడ్ స్థానానికి ఎసరు పెట్టేలా ఉన్నాయి.రుతురాజ్ గైక్వాడ్ గతంలో అద్భుతమైన ప్రదర్శన చేసినప్పటికీ, ప్రస్తుత ఫామ్ ఆయన కెప్టెన్సీని ప్రశ్నార్థకం చేస్తోంది. జట్టు విజయం సాధిస్తున్న తరుణంలో ఆయన వైఫల్యాలు బయటకు కనిపించకపోయినా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌ల్లో ఓపెనర్ విఫలమైతే జట్టు మూల్యం చెల్లించుకోక తప్పదు. మరి రానున్న మ్యాచ్‌ల్లోనైనా ఈ 'సూపర్ స్టార్' ఫామ్ పుంజుకుంటారో లేక చెన్నై నాయకత్వ మార్పు దిశగా అడుగులు వేస్తుందో వేచి చూడాలి.


## రిటైర్మెంట్‌తో షాకిచ్చిన సమిత్ పటేల్



ఇంగ్లాండ్ వెటరన్ క్రికెటర్ సమిత్ పటేల్ తన సుదీర్ఘమైన కౌంటీ క్రికెట్ ప్రయాణానికి వీడ్కోలు పలికాడు. గోవాలో జరిగిన వరల్డ్ లెజెండ్స్ ప్రో టీ20 లీగ్‌లో పాల్గొనడమే ఆయన కెరీర్‌కు శాపంగా మారింది. ఇంగ్లాండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నిబంధనల ప్రకారం, అనుమతి లేని లీగ్‌లలో ఆడే ఆటగాళ్లు ఏడాది పాటు ఇంగ్లీష్ దేశీయ క్రికెట్‌కు అనర్హులు. ఈ నిబంధన కారణంగా సమిత్ పటేల్‌పై 12 నెలల నిషేధం విధించడంతో, ఆయన ఇక ఆడే అవకాశం లేక రిటైర్మెంట్ ప్రకటించక తప్పలేదు. సమిత్ పటేల్ 2008 నుంచి 2015 మధ్య కాలంలో ఇంగ్లాండ్ తరపున 60 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. అంతర్జాతీయ స్థాయిలో కంటే కౌంటీ క్రికెట్‌లో ఆయన ఒక దిగ్గజంగా ఎదిగాడు. నాటింగ్‌హామ్‌షైర్ క్లబ్ తరపున దాదాపు 22 ఏళ్ల పాటు సేవలందించాడు. తన కెరీర్‌లో అన్ని ఫార్మాట్లు కలిపి 25,000 పైగా పరుగులు సాధించడమే కాకుండా, 800 పైగా వికెట్లు తీసి అత్యుత్తమ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ది హండ్రెడ్ వంటి ప్రతిష్టాత్మక లీగ్‌లలో కూడా ఆయన తన ముద్ర వేశాడు.తన రిటైర్మెంట్ గురించి సమిత్ పటేల్ మాట్లాడుతూ, లీగ్‌లో ఆడితే ఎదురయ్యే పరిణామాల గురించి స్పష్టత ఉంటే తాను ఆ నిర్ణయం తీసుకునేవాడిని కాదని పేర్కొన్నాడు. వచ్చే సీజన్ కోసం కొన్ని కౌంటీ జట్లతో చర్చలు జరుగుతున్నాయని, కానీ ఈ నిషేధం తన అవకాశాలను దెబ్బతీసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. అయితే, కేవలం ఇంగ్లాండ్ దేశీయ క్రికెట్‌కు మాత్రమే స్వస్తి పలుకుతున్నానని, ప్రపంచవ్యాప్తంగా జరిగే ఇతర ఫ్రాంచైజీ లీగ్‌లలో ఆటగాడిగా కొనసాగుతానని ఆయన స్పష్టం చేశాడు.సమిత్ పటేల్ వీడ్కోలు సందర్భంగా నాటింగ్‌హామ్‌షైర్ క్లబ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించింది. క్లబ్ డైరెక్టర్ మిక్ నెవెల్ మాట్లాడుతూ, పటేల్ కేవలం ఒక ఆటగాడు మాత్రమే కాదని, క్లబ్ చరిత్రలో ఒక చెరగని ముద్ర వేసిన యోధుడని కొనియాడాడు. 22 ఏళ్ల పాటు ఆయన చూపిన అంకితభావం, గెలవాలనే పట్టుదల ఎంతో మంది యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నాడు. కేవలం సమిత్ పటేల్ మాత్రమే కాకుండా, ఆస్ట్రేలియా ఆటగాడు పీటర్ సిడిల్ కూడా ఇదే లీగ్‌లో ఆడినందుకు నిషేధానికి గురవ్వడం గమనార్హం.

# మరోమారు వాయిదా దిశగా పెద్ది


## జూన్ 4 నుంచి 24కు మారినట్లు వార్తలు




మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో రూపొందుతున్న ఈ చిత్రం మల్టీ స్పోర్ట్స్ నేపథ్యంతో ప్రత్యేకంగా రూపొందుతోంది. ఇప్పటికే చిత్రీకరణ దాదాపు పూర్తయిందని, ఒక పాట మినహా మిగతా భాగం ముగిసినట్లు చిత్రబృందం తెలిపింది. ప్రస్తుతం ఆ చివరి పాట చిత్రీకరణ కొనసాగుతుండగా, విడుదల తేదీపై కూడా స్పష్టత వస్తోంది. ముందుగా జూన్‌లో సినిమా విడుదల అవుతుందని ప్రకటించిన మేకర్స్, ఖచ్చితమైన తేదీని మాత్రం వెల్లడించలేదు. తాజా సమాచారం ప్రకారం, ఇంకా పూర్తి చేయాల్సిన పనులు ఉండటంతో జూన్ 4న సినిమా విడుదల కష్టమని తెలుస్తోంది. దీంతో జూన్ 25ను విడుదల తేదీగా నిర్ణయించే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూన్ 24 రాత్రి నుంచే ప్రీమియర్ ప్రదర్శనలు కూడా ఉండే అవకాశముంది. ఈ విడుదల తేదీపై చిత్రబృందం నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. అభిమానులు మాత్రం ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలతో ఎదురు చూస్తున్నారు. స్పోర్ట్స్ నేపథ్యంలో భావోద్వేగాలను కలిపి రూపొందుతున్న ఈ చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని భావిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తనదైన శైలిలో కథను తెరకెక్కిస్తున్నందున ఈ ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారుతోంది. ఇప్పటికే చిత్రం నుండి విడుదలైన 'పహిల్వాన్ గ్లింప్స్'కు తోడు ఏఆర్ రెహమాన్ అందించిన 'చికిరి చికిరి', 'రేయ్ రేయ్ రా' వంటి పాటలు చార్ట్‌బస్టర్లుగా నిలిచాయి. తాజాగా ఈ చిత్రంలో ఉండబోయే హై-వోల్టేజ్ స్పెషల్ సాంగ్ కోసం చిత్ర యూనిట్ గ్లామర్ బ్యూటీ శృతి హాసన్‌ని ÷నైల్ చేసినట్టు విశ్వసనీయ సమాచారం.



# సితార పిక్చర్స్‌లో నితిన్




యంగ్ హీరో నితిన్ వరుస ప్లాపులతో బాగా వెనుకబడిపోయాడు. బీష్మ తర్వాత సరైన హిట్ లేక సతమతమవుతున్నాడు. దాంతో లాంగ్ గ్యాప్ తీసుకున్న నితిన్ మరొక సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్నాడు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం ద్వారా సోము, నర్రి అనే ఇద్దరు డెబ్యూ డైరెక్టర్లు టాలీవుడ్‌కు పరిచయం కాబోతున్నారు. విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా గురించి తాజాగా ఒక ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలుగులోకి వచ్చింది. ఈ కొత్త చిత్రం మే 4వ తేదీన లాంఛనంగా ప్రారంభించి ఏమాత్రం ఆలస్యం చేయకుండా మే 6వ తేదీ నుంచే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. ప్రీ ప్లాన్ షెడ్యూల్ తో కేవలం 55 రోజుల్లోనే ఈ సినిమా పూర్తి షూటింగ్‌ను కంప్లీట్ చేయాలని మేకర్స్ టా÷-గ్గ÷ట్‌గా పెట్టుకున్నారు. అంటే దాదాపు రెండు నెలల లోపే షూటింగ్ పార్ట్ అంతా పూర్తయిపోతుంది. నితిన్ కెరీర్‌లో ఇది వన్ ఆఫ్ ది ఫాస్టెస్ట్ ప్రాజెక్ట్ అని చెప్పవచ్చు. ఈ చిత్రంలో నితిన్ సరసన కథానాయికగా రితికా నాయక్ నటించబోతున్నట్లు సమాచారం. 'అశోక వనంలో అర్జున కళ్యాణం' సినిమాతో మెప్పించిన రితికాకు ఇది నితిన్‌తో ఫస్ట్ మూవీ. ఇక ఈ చిత్రానికి 'విరాటపర్వం' ఫేమ్ సురేష్ బొబ్బిలి సంగీతాన్ని అందించబోతున్నారు. మరో ఎన్నాళ్ళుగానో హిట్ కోసం వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నా నితిన్ కు డెబ్యూ డైరెక్టర్స్ హిట్ ఇస్తారో లేదో చూడాలి.



# తెలుగులో బంపరాఫర్


తెలుగు ఇండస్ట్రీలో స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నది మంగళూరు సోయగం కృతిశెట్టి. 'ఉప్పెన' తర్వాత ఈ సొగసరికి టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వరించినా.. అందులో చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయ్యాయి. దాంతో గత రెండేళ్లుగా తెలుగు సినిమాలకు విరామం ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ టాలీవుడ్‌లో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది.వెంకటేష్-కల్యాణ్‌రామ్ కాంబోలో దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న మల్టీస్టారర్ చిత్రంలో కృతిశెట్టి ఓ నాయికగా ఎంపికైనట్లు సమాచారం. ఆమె కల్యాణ్‌రామ్ సరసన జోడీ కట్టబోతున్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. వెంకటేష్‌కు జతగా కీర్తి సురేష్ నటించనుందని తెలుస్తున్నది. జూన్‌లో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

## లీగల్ వివాదాల్లో దృశ్యం-3 ఆలస్యం కానున్న విడుదల




మలయాళ వెండితెరపై సంచలనం సృష్టించిన 'దృశ్యం' సిరీస్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో మోహన్ లాల్ హీరోగా వచ్చిన ఈ సిరీస్ సంచలనాలు సృష్టించింది. ఇప్పుడు ఈ సిరీస్‌లో మూడవ భాగం 'దృశ్యం 3' కోసం ప్రేక్షకులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సినిమా విడుదలకు ముందే చట్టపరమైన చిక్కుల్లో పడటం ఇప్పుడు కేరళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాను నిర్మిస్తున్న ఆశీర్వాద్ సినిమాస్ సంస్థ గతంలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫారమ్ అమెజాన్ ప్రైమ్‌తో కుదుర్చుకున్న డిజిటల్ డీల్‌ను రద్దు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన అమెజాన్ ప్రైమ్ సంస్థ ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ హైకోర్టు, డిజిటల్ సంస్థకు అనుకూలంగా కీలక తీర్పునిచ్చింది. మే 15వ తేదీ వరకు 'దృశ్యం 3' సినిమాకు సంబంధించి ఎలాంటి కొత్త డీల్స్ క్షి లేదా ఇతర డిజిటల్ హక్కులు కుదుర్చుకోకూడదని నిర్మాతలకు స్టే ఆర్డర్ జారీ చేసింది. ఈ అనూహ్య పరిణామంతో చిత్ర యూనిట్ డైలమాలో పడింది. వాస్తవానికి ఈ చిత్రాన్ని మే 21న విడుదల చేయాలని నిర్మాతలు భావించారు. అయితే కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిన నేపథ్యంలో సమస్య త్వరగా కొలిక్కి రాకపోతే మే 21న సినిమా ప్రేక్షకుల ముందుకు రావడం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. అటు మోహన్ లాల్ అభిమానులు మాత్రం ఈ వివాదం త్వరగా పరిష్కారం కావాలని కోరుకుంటున్నారు.

## ప్రెగ్నెన్సీలో దీపికా సాహసం.. 'కింగ్' కోసం భారీ యాక్షన్ సీన్స్!



బాలీవుడ్ కింగ్ షారుక్‌ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్‌ల క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం 'కింగ్'. ఈ సినిమాలో షారుక్‌కు జోడీగా దీపికా పదుకొణె నటిస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఆమె ప్రస్తుతం గర్భవతి కావడంతో ఈ సినిమాలో తన యాక్షన్ సన్నివేశాలకు మేకర్స్ కాస్త విరామం ఇస్తారని అందరూ భావించారు. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ, దీపికా ఏప్రిల్ 21, 22 తేదీల్లో జరిగిన షూటింగ్ షెడ్యూల్‌లో అత్యంత భారీ పోరాట సన్నివేశాల్లో పాల్గొన్నట్లు సమాచారం. చిత్రబృందం ప్రత్యేకంగా రూపొందించిన సెట్‌లో ఆమె ఎంతో ఉత్సాహంగా ఈ యాక్షన్ సీన్స్‌ను పూర్తి చేసినట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, త్వరలోనే సుమారు ఎనిమిది మంది ఫైటర్లతో కూడిన మరో భారీ పోరాట ఘట్టాన్ని ఇసుకలో చిత్రీకరించేందుకు సిద్ధార్థ్ ఆనంద్ ప్రణాళికలు సిద్ధం చేశారు. షారుక్, దీపికా ఇద్దరి కాంబినేషన్‌లో రానున్న ఈ ఇసుక పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలవనుందట. ఇక సినిమా వాయిదా పడుతుందేమో అన్న సందేహాలకు తెరదించుతూ, డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తాజాగా ఒక ప్రత్యేక వీడియో ద్వారా స్పష్టం చేశారు. దీంతో ఈ ఏడాది చివరలో 'కింగ్' బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని అభిమానులు ఖరారు చేసుకున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com